# తిరుమలక్షేత్ర గాథ

(సంగ్రహం - సమగ్రం)

రచయిత

**జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**

కన్సల్టెంటు, ప్రచురణల విభాగం,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2022**

# TIRUMALAKSHETRA GAADHA

**(SANGRAHAM - SAMAGRAM)**

*By*
**Julakanti Balasubrahmanyam**

T.T.D. Religious Publications Series No. 1382
© All Rights Reserved

*First Edition : 2022*

*Copies :* 500

*Published by :*
**Dr.K.S.Jawahar Reddy**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# ముందుమాట

**కట్టెదుర వైకుంఠము కాణాచయినకొండ!**
**తెట్టెలాయ మహిమలే తిరుమలకొండ!!**

**– అన్నమయ్య**

“సప్తగిరుల” మీద వెలసి ఉన్న శ్రీనివాస భగవానుడు సాటిలేని మేటి దేవుడు! ఆస్వామి పిలిస్తే పలికే దేవుడు. కోర్కెలు తీర్చే వరాలరాయడు. ఆదుకొనే ఆపద్బంధువు! ఇలా ఆ స్వామిని గూర్చి ఎంతైనా చెప్పుకోవచ్చు. అలాగే ఆ స్వామి వెలసిన తిరుమలక్షేత్రంలో కూడా అడుగడుగునా అణువణువునా ఆధ్యాత్మికత ఉట్టిపడుతూ భక్తులకు వింత వింత అనుభూతులు కలుగుతుంటాయి.

ముఖ్యంగా వైకుంఠంలోని శ్రీమహావిష్ణువు కలియుగ వైకుంఠమైన తిరుమలక్షేత్రానికి తరలిరావడం, ఆ తర్వాత శ్రీమహాలక్ష్మి కూడ శ్రీస్వామివారి వక్షఃస్థలంలో “వ్యూహలక్ష్మి”గా చేరుకోవడం వంటి దివ్యగాథను ఎన్నిమార్లు పఠించినా, పారాయణం చేసినా, పరమపవిత్రుల్ని చేస్తుంది. శ్రోతల్ని పునీతుల్ని చేస్తుంది.

ఇక తిరుమలకు చేరుకొన్న శ్రీవేంకటేశ్వరునికి ఉన్న పేర్లు, ఏడుకొండల దివ్యగాథలు, ఆ స్వామివారికి జరుగుతున్న అర్చనలు, ఆరాధనలు, ఆరగింపులు, నిత్యోత్సవాలు, వారోత్సవాలు, మాసోత్సవాలు, సంవత్సరోత్సవాలు.... ఇలా ప్రతిదానిలో ఏదో ఒక ప్రత్యేకత, విశిష్టత చోటుచేసుకొని భక్తులను ఆశ్చర్యచకితుల్ని చేస్తుంటాయి.

ఇంతమాత్రమేగాక, ప్రతి యాత్రికుడు, భక్తుడు తప్పక తెలుసుకోవలసిన వసతి, శ్రీవారిదర్శన విధానం, చూడవలసిన, అద్భుత ప్రదేశాలు,

దర్శించవలసిన పుణ్యతీర్థాలు, ప్రత్యేకస్థలాలు.... తిరుమలక్షేత్రంలో ఎన్నెన్నో ఉన్నాయి.

తిరుమలక్షేత్ర యాత్రకు విచ్చేసే ప్రతిభక్తుడు ప్రతి యాత్రికుడు తప్పక తెలుసుకొనవలసిన ఇలాంటి అనేక అంశాలను, విశేషాలను అత్యంత సరళమైన శైలిలో రచయిత శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యంగారు **"తిరుమలక్షేత్ర గాథ"**ను అత్యంత సంగ్రహంగాను, సమగ్రంగాను అందించారు. ఇదివరకే వీరు శ్రీనివాస భగవానుడికి సంబంధించిన **'హరికొలువు', 'సిరికొలువు'** వంటి అనేక అమూల్యమైన రచనలు భక్తలోకానికి కానుకలుగా సమర్పించి ధన్యులయ్యారు.

ప్రస్తుతం సంగ్రహంగా, సమగ్రంగా ఉన్న **"తిరుమలక్షేత్ర గాథ"** పుస్తకాన్ని కూడ తిరుమల తిరుపతి దేవస్థానం ధార్మిక ప్రచురణగా అందిస్తున్నది. భక్తలోకం ఈ పుస్తకాన్ని కూడా అందుకొని తిరుమలక్షేత్రాన్ని గూర్చి సమగ్రమైన అవగాహన కలిగించుకుంటారని ఆకాంక్షిస్తున్నాను.

**ఓం నమో వేంకటేశాయ**

*సదా శ్రీవారి సేవలో....*

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి.

# ఇందులో....


| | |
|---|---|
| ముందుమాట | ii |
| 1. తిరుమలక్షేత్ర గాథ | 1 |
| 2. శ్రీవేంకటేశ్వరావతారం | 2 |
| 3. భూలోక వైకుంఠం తిరుమల | 3 |
| 4. అతిలోక సుందరుడు ఆనందనిలయుడు | 3 |
| 5. తిరుమలక్షేత్రం - సంక్షిప్తగాథ | 11 |
| 6. తిరుమలేశుని సేవలో తరించిన భక్తులు | 24 |
| తొండమానుడు - భీముడు | 24 |
| తిరుమలనంబి | 26 |
| అనంతాళ్వారు | 28 |
| తాళ్లపాక అన్నమాచార్యులు | 31 |
| మహంతు హథీరాం బావాజీ | 33 |
| మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ | 35 |
| 7. తిరుమలేశుని ఉత్సవాలు | 38 |
| నిత్యోత్సవాలు | 38 |
| వారోత్సవాలు | 40 |
| మాసోత్సవాలు | 41 |
| సంవత్సరోత్సవాలు | 42 |
| 8. వసతి సౌకర్యం | 51 |
| 9. శ్రీవారి దర్శన విధానం | 51 |
| 10. తిరుమలలో చూడవలసిన అద్భుత ప్రదేశాలు | 51 |
| శ్రీవారి కల్యాణకట్ట | 53 |
| శ్రీ స్వామిపుష్కరిణి | 54 |

| | | |
|---|---|---|
| | శ్రీ ఆదివరాహస్వామి ఆలయం | 54 |
| | మాతృశ్రీ తరిగొండవెంగమాంబ బృందావనం | 55 |
| | తిరుమలనంబి గుడి | 55 |
| | అనందాళ్వార్ తోట | 56 |
| | శ్రీవేంకటేశ్వర మ్యూజియం | 56 |
| | నారాయణగిరి పాదాలు | 57 |
| 11. | తిరుమలలో దర్శించవలసిన దివ్య తీర్థాలు | 57 |
| | గోగర్భతీర్థం (పాండవతీర్థం) | 58 |
| | శ్రీహథీరాంబావాజీ సమాధి (ఆకాశగంగతీర్థం దగ్గర) | 58 |
| | ఆకాశగంగా తీర్థం | 58 |
| | పాపవినాశనం | 60 |
| | వైకుంఠతీర్థం | 60 |
| | చక్రతీర్థం – శిలాతోరణం | 61 |
| | శ్రీరామకృష్ణ తీర్థం | 61 |
| | కుమారధారా తీర్థం | 62 |
| | తుంబురు తీర్థం (ఘోణతీర్థం) | 62 |
| 12. | తిరుమలలో తెలుసుకోవలసిన ప్రత్యేక స్థలాలు | 63 |
| | అఖండ శ్రీహరి నామసంకీర్తనం | 63 |
| | ఆస్థాన మండపం | 63 |
| | నాదనీరాజనమండపం | 64 |
| | వైభవోత్సవ మండపం | 64 |
| | గ్రంథ విక్రయశాలలు | 64 |
| | మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం | 65 |
| | పురోహిత సంఘం | 66 |
| | వేదపాఠశాల | 66 |

## 1. తిరుమలక్షేత్ర గాథ

**"సత్యం సత్యం పునస్సత్యం**
**న దేవో వేంకటేశ్వరాత్**
**బ్రహ్మాండే నాస్తి యత్కించిత్**
**న భూతం న భవిష్యతి"**

**- శ్రీవేంకటాచలమాహాత్మ్యం (భవిష్యోత్తర పురాణాంతర్గతం)**

సత్యంగా చెబుతున్నమాట! ఒక మారు కాదు. రెండు మార్లు కాదు. పదే పదే చెబుతున్న సత్యమైన మాట! ఏమిటా సత్యమైన మాట!

అంటే, శ్రీవేంకటేశ్వరునివంటి దేవుడు ఈ బ్రహ్మాండాల్లో ఎక్కడా లేడు. లేనేలేడు. ఇపుడు మాత్రమే కాదు. అటు గడచిన భూతకాలంలోనూ, ఇటురాబోయే భవిష్యత్కాలంలోను లేడు. లేనే లేడు, ఉండడు కూడా.

అందువల్లే శ్రీ వేంకటేశ్వరస్వామి కలియుగ ప్రత్యక్షదైవంగా కీర్తింపబడ్డాడు.

**శ్లో॥ కృతేతు నరసింహోऽభూత్ త్రేతాయాం రఘునందనః**
**ద్వాపరే వాసుదేవ శ్చ కలౌ వేంకటనాయకః**

కృతయుగంలో నరసింహుడు, త్రేతాయుగంలో శ్రీరాముడు, ద్వాపరయుగంలో వాసుదేవుడు (శ్రీకృష్ణుడు), కలియుగంలో శ్రీవేంకటేశ్వరుడు - ఈ నాలుగు అవతారాలు నాలుగు యుగాల్లో ప్రసిద్ధిని పొందాయి.

బాగుంది!

వీటిల్లో మొదటి మూడు అవతారాలు, శ్రీమహావిష్ణు దశావతారాల్లో చెప్పబడ్డవే! కాని విచిత్రం! ఏమంటే కలియుగంలో వేంకటేశ్వరుడు అవతారంగా ప్రత్యేకంగా పేర్కొనబడటం. విలక్షణంగా ఉంది కదూ!

ఆ యా యుగాల్లో, ఆ యా రక్కసులను సంహరించి ధర్మం నిలబెట్టడం కోసం వచ్చిన అవతారాలు మాత్రమే ఆ మూడు కూడా! కాని శ్రీనివాసుని అవతారం అలా సంభవించలేదు. శ్రీ వైకుంఠంనుంచి సాక్షాత్తుగా దిగివచ్చిన దివ్యమంగళ అర్చావతారమూర్తి శ్రీవేంకటేశ్వరుడు.

* * *

## 2. శ్రీ వేంకటేశ్వరావతారం

మహావిష్ణువు ప్రత్యక్షంగా శ్రీవైకుంఠంనుంచి "శ్రీ వేంకటేశ్వరస్వామి" అవతారంగా ఈ భువికి దిగిరావడానికి ఈ కలియుగంలోని లక్షణాలే ప్రధానకారణం.

ఇతర యుగాలలోని మానవులకంటె కలియుగంలోని మనిషి అల్పాయుష్కుడు మాత్రమే గాక బలహీనుడు కూడా. అంతమాత్రమే గాక ఈర్ష్య అసూయ, ద్వేషం, లోభం, అహంకారం వంటి దుష్టలక్షణాలతో కలియుగంలోని మానవుని మనస్సు కలుషితమవుతున్నది. చంచలమవుతున్నది. ఇన్ని దోషాలను కలిగిన ఇప్పటి మనిషి, ఇతర యుగాలలోలాగ నేరుగా వైకుంఠంలోని భగవంతుని దగ్గరికి వెళ్లలేని అసమర్థుడు అవుతున్నాడు.

అందువల్లే భగవంతుడు కలియుగంలోని భక్తులను ఉద్ధరించడంకోసం శ్రీవైకుంఠలోకాన్ని వదలిపెట్టి 'శ్రీవేంకటేశ్వరుడు' అనే పేరుతో భూలోకానికి దిగి వచ్చాడు.

అంచేతే ఆ స్వామికి **"కలౌ వేంకట నాయకః"** అనే ప్రసిద్ధి కలిగింది. కలుషాలమయమైన ఈ కలియుగంలో భక్తులను రక్షించి, వారి కోరికలను తీర్చగలిగిన **"ఒకే ఒక నాయకుణ్ణీ, ఒకే ఒక దిక్కు, గతీ నేనే"** అంటూ భగవంతుడు శ్రీ వేంకటేశ్వరుడి పేరుతో అర్చామూర్తిగా అవతరించాడు.

* * *

## 3. భూలోక వైకుంఠం తిరుమల

అలా అవతరిస్తూ, వైకుంఠంలోని గిరులతో, తరులతో, సరస్సులతో, ఉభయ దేవేరులైన శ్రీదేవి భూదేవులతో, గరుత్మంతుడు మున్నగు సేవకులతో మహావిష్ణువు తరలి వచ్చాడు. ఆ వైకుంఠం నుంచి వచ్చి భువిలో, ఇదిగో ఇక్కడ "శ్రీ వేంకటేశ్వరుడు" పేరుతో దర్శనం ఇస్తూ నిలిచివున్న దివ్యస్థలం "భూలోక వైకుంఠం"గా భాసిస్తోంది. అదే "తిరుమల" పుణ్యక్షేత్రం!

* * *

## 4. అతిలోక సుందరుడు ఆనందనిలయుడు

**శ్రీవేంకటేశమతి సుందర మోహనాంగం**
**శ్రీభూమికాంత మరవింద దళాయతాక్షమ్**
**ప్రాణప్రియం ప్రవిలసత్కరుణాంబురాశిం**
**బ్రహ్మేశ వంద్య మమృతం వరదం భజామి**

ఆనందనిలయుడు అందరినీ సమ్మోహనపరచే అతిలోక సుందరాంగుడు. ఆ స్వామివారికి పద్మాలవంటి కన్నులు ఉంటాయి. ఆ దేవదేవుడు శ్రీదేవి భూదేవులతో కూడి ఉంటాడు. అత్యంత ప్రాణప్రదమైనవాడు. కరుణా సముద్రుడు. ఆ స్వామివారిని బ్రహ్మదేవుడు, శివుడు కీర్తిస్తుంటారు. మోక్షప్రదాత! ఇంతటి దేవదేవుడైన శ్రీవేంకటేశుణ్ణి భజిస్తాను.

ఇంతటి సుందరుడైన దేవుడు **"నేను వైకుంఠాన్నయినా విడిచివుంటాను గాని, నా భక్తులను విడిచి ఒక్క క్షణమైనా ఉండలేను"** అంటూ శ్రీవైకుంఠం నుంచి దిగివచ్చి భూలోకంలో వేంకటాచలంలో అద్భుత సాలగ్రామశిలామూర్తిగా వక్షఃస్థల శ్రీమహాలక్ష్మితో స్వయంవ్యక్త రూపంలో ఆవిర్భవించాడు. ఆ వక్షఃస్థల లక్ష్మివల్లే ఆ స్వామి 'శ్రీ'నివాసుడయ్యాడు.

## విచిత్ర భంగిమ

శిరస్సున కిరీటంతో, యజ్ఞోపవీతంతో, నడుమున నందక ఖడ్గంతో పై కుడి ఎడమ రెండుచేతుల్లో శంఖచక్రాలను ధరించి, కింది కుడిచేతిని వరదముద్రలో, ఉంచి తన పాదద్వయాన్ని శరణువేడుమన్నట్లుగా చూపిస్తున్నాడు. అలాగే క్రింది ఎడమచేతిని నడుముపై ఉంచి కటిహస్తంతో మోకాళ్లను చూపుతున్నాడు. విచిత్రమైన ఈ భంగిమలో, తాను నిలిచివున్న ఈ చోటే సాక్షాత్తు శ్రీవైకుంఠం, అంతేగాక నా యీ పాదాలను శరణు వేడితే చాలు. అలాంటివారికి **"సంసార సాగర సముత్తరణైక సేతో"** అన్నట్లు సేతువునై అగాథమైన సంసార సముద్రాన్ని మోకాళ్లబంటిగా చేసి సులువుగా దాటిస్తాను. అంటూ **'కటిహస్తం'**తోను, మీ వరాలనన్నింటి ఇస్తానంటూ **'వరదహస్తం'**తోను చూపుతూ ఒక సొంపైన భంగిమలో నిలిచివున్న స్వామి శ్రీనివాసుడు.

## పంచబేరాలు

ఆనందనిలయ గర్భాలయంలో సాలగ్రామశిలామూర్తి అయిన మూలవిరాట్టుతోపాటు శ్రీనివాసస్వామివారికి మరి నాలుగు రకాల ఉత్సవమూర్తులు ఉన్నాయి. వీటిని మూలమూర్తితో కలిపి పంచబేరాలు అంటారు. మూలవిరాట్టు స్థిరంగా, 8 అడుగుల ఎత్తు సాలగ్రామ శిలామూర్తిని ధ్రువబేరం అంటారు. ఈ స్వామివారి దర్శనంకోసమే భక్తులు యాత్రకు వస్తారు. ఈ మూలవిరాట్టుకే ప్రతిరోజు ప్రధానంగా సుప్రభాతం రెండుమార్లు తోమాలసేవ అనే పుష్పాలంకరణసేవ, ఉదయం సహస్రనామార్చన, మధ్యాహ్నం సాయంత్రం అష్టోత్తరశతనామార్చనలు, మూడుపూటలా నివేదనలు జరుగుతాయి.

ప్రతి మంగళవారం అష్టదళ పాదపద్మారాధన, గురువారం తిరుప్పావడసేవ, నేత్రదర్శనం, రాత్రి పూలంగిసేవ, శుక్రవారం ఉదయం

సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం జరుగుతుంది. శ్రీస్వామివారికి అర్చనలు, నివేదనలు జరిగిన వెంటనే వక్షఃస్థలంలోని "వ్యూహలక్ష్మి"కి జరుపుతారు. ఇక రెండవబేరం, **భోగశ్రీనివాసమూర్తి మూలమూర్తికి** నకలు వెండిప్రతిమ అయిన ఈయన్నే మనవాళపెరుమాళ్ అని అంటారు. సుమారు $1\frac{1}{2}$ అడుగుల ఎత్తు వున్న ఈ వెండిమూర్తికి ప్రతిరోజు ఉదయం ఆకాశగంగా తీర్థాభిషేకం రాత్రి పవ్వళింపుసేవ 'ఏకాంతసేవ' జరుగుతుంది. ఈ స్వామివారికి ప్రతి బుధవారం బంగారువాకిలి వద్ద సహస్రకలశాభిషేకం జరగుతుంది.

ఇక మూడవబేరం **'కొలువు శ్రీనివాసమూర్తి'**. మూలమూర్తికి నకలు పంచలోహప్రతిమ. $1\frac{1}{2}$ అడుగుల ఎత్తువున్న ఈ మూర్తికి ప్రతిరోజు బంగారువాకిలి లోపల 'బంగారు సింహాసనం'లో కొలువు, దర్బార్ జరుగుతుంది. పంచాంగశ్రవణం అయిన తర్వాత ఆదాయవ్యయాలు. మున్నగు లెక్కలన్నీ వినే స్వామి ఈ కొలువుమూర్తి. నాల్గవమూర్తి **"ఉగశ్రీనివాసమూర్తి"**. శ్రీదేవిభూదేవులతో కూడివున్న ఈ ఉగ్రమూర్తికి పూర్వం ఉత్సవాలు జరిగేవి. ఇప్పుడు జరగడం లేదు. ఒక **కార్తీక కైశిక ద్వాదశిరోజున** మాత్రమే తెల్లవారుజామున సూర్యోదయానికి పూర్వమే ఉత్సవం పూర్తి చేసుకొని ఆలయంలోనికి వెళ్తారు.

ఐదవమూర్తి **ఉత్సవ శ్రీనివాసమూర్తి**. వీరే మలయప్పస్వామి శ్రీదేవీ భూదేవీ సమేతంగా ఉన్న ఉత్సవమూర్తి. మలయప్పకోనలో లభ్యమయ్యాడట. అందువల్ల మలయప్పస్వామి అని పిలువబడుతూ ఆలయం బయట అన్ని ఉత్సవాల్లో పాల్గొంటూ, భక్తులకు సన్నిహితంగా దర్శనమిస్తుంటాడు.

ఇవి గాక ఆనందనిలయగర్భాలయంలో **సందర్శన చక్రత్తాళ్వార్, ఆనంతుడు, శ్రీసీతారామలక్ష్మణులు, శ్రీరుక్మిణీ శ్రీకృష్ణులు,**

**సుగ్రీవహనుమంతులు, గరుత్మంతుడు, విష్వక్సేనుడు** మున్నగు ఉత్సవమూర్తులు ఆ యా వేళ్లలో ఊరేగింపుల్లో పాల్గొంటున్నాయి. వీటిల్లో కొన్నింటిని ప్రస్తుతం తీర్థం ఇచ్చేచోట అరలో చూడవచ్చు.

## వింత వింత పేర్లు

తిరుమలేశుడికి పేర్లు ఎన్నో ఎన్నెన్నో ఉన్నాయి. అవన్నీ విచిత్రమైన పేర్లు. అవన్నీ ఆ స్వామివారి అసలైన సొంత పేర్లా అంటే అదీ చెప్పలేం. కాని ఒక్కటిమాత్రం నిజం. భక్తులు ప్రియంగా పిలుచుకుంటున్నవే. ఇష్టంగా పిలుచుకుంటున్నవే.

వాటిల్లో ప్రసిద్ధమైంది **'ఏడుకొండలవాడా!'** అని. **శేషాద్రి, వేంకటాద్రి, నారాయణాద్రి, గరుడాద్రి, వృషాద్రి, వృషభాద్రి, అంజనాద్రి** అనే ఏడుకొండల్లో ఉన్న స్వామి కనుక **ఏడుకొండలవాడయ్యాడు.** అలాగే వేం= పాపాలను; కటః= పోగొడతాడు అని ఒక అర్థం. కాగా వేం= ఐశ్వర్యాన్ని; కట= కటాక్షిస్తాడు. కనుక 'వేంకటపతి' అనీ, తిరుమలేశుడనీ, స్థలాన్ని బట్టి చేసేపనిని బట్టి పిలువబడుతున్న స్వామి శ్రీనివాసుడు.

కాని అన్నీ పేర్లకంటె మరో విచిత్రమైన పేరు ఉంది. అదేమంటే భార్యపేరుతో పిలిపించుకోవడం. అదే 'శ్రీ'నివాసుడు. ఆయన వక్షః స్థలంలో ఉన్న "వ్యూహలక్ష్మి" భక్తులకు కోరికలను తీర్చడంలో, స్వామికి చెప్పి సిఫారసు చేస్తుందట. ఆమె **"వాత్సల్యగుణోజ్జ్వల"** కనుక భక్తులమీద ప్రేమ ఎక్కువ. ఆ తల్లి వల్లే **"'శ్రీ'నివాసుడు"** అంటున్నారు. అసలు నీ పేరేమయ్యా అంటే చెప్పడు కాని, "**అడుగడుగుదండాలవాడా!** అన్నా పలుకుతాడు. **"ఆపద్బాంధవా!"** అన్నా పలుకుతాడు. ఇలా ఏ పేరుతో పిలిచినా పలుకుతూ మన కోరికలు తీరుస్తూనే వున్న వింత వింత పెట్టుడు పేర్ల దేవుడు వేంకటేశుడు.

## అబ్బుర పరిచే ఆభరణాలు

ఘనవేంకటేశునకు పాదాది శిరస్సువరకు ఎన్నో దివ్యాభరణాలు మణిహారాలు, అలంకరింపబడి భక్తులకు ఆశ్చర్యంతోపాటు ఆనందాన్ని కలిగిస్తాయి. అలా జిగేలుమనీ మెరిసే అలంకారాలు ఎనెన్నో!

బంగారు పద్మపీఠం, బంగారుపాద కవచం, స్వర్ణ పీతాంబరం, బంగారు నందకఖడ్గం, వజ్రాలు తాపిన సూర్యకఠారి, వైకుంఠహస్తం (వరదహస్తం) కటిహస్తం, బంగారుకవచాలు, సాలగ్రామహారాలు శంఖుచక్రాల బంగారుకవచాలు, నవరత్నాలుతాపినవి, లక్ష్మీహారం, నాలుగుపేటల సహస్రనామమాలలు వజ్రకిరీటాలు, మకరతోరణం... ఇలా ఎన్నో ఎన్నెన్నో శ్రీవేంకటేశ్వరస్వామివారికి ఆపాదమస్తకం ఆభరణాలు వున్నాయి.

ఆ యా విశేష సందర్భాల్లో వీటిని స్వామికి అలంకరిస్తారు. ఇవన్నీ ఎక్కడివి? ఎవరిచ్చారు? అంటే కోరికలు తీరిన భక్తులు ఇచ్చి వుంటారు. ఎంతమందికి మాటలు ఇచ్చాడో, మాట నిలబెట్టాడో, ఎందరికి కడుపును పండించాడో, ఎందరికి కడుపు నింపాడో, ఎవరికి చేతులిచ్చాడో, ఎందరికి చేతలిచ్చాడో, ఎందరికి కన్ను లిచ్చాడో, కాళ్లిచ్చాడో, ఎవరికి తెలుసు. ఇదిగో! అలా కోరికలు తీరిన భక్తులే స్వామివారికి మణులిచ్చారు. అలంకారా లిచ్చివుంటారు. ఆ భక్తులు ఇచ్చిన వాటినే శ్రీనివాసుడు మురిపెంగా అలంకరించుకొంటూ భక్తులను మురిపిస్తున్నాడు. అయితే స్వామివారు ఏ భక్తునికి ఏ కోరిక తీర్చాడో ఒక్క స్వామికి మాత్రమే తెలియాలి. అంతే! అంతే!

## కమ్మని ఆరగింపులు

ఆనందనిలయుడు అలంకారప్రియుడు! అంతకంటె మిక్కిలి ఆహారప్రియుడు! అంతకంటే భక్తప్రియుడు! భక్తుల కోసమే ఎన్నెన్నో

కమ్మగా ఉండే **లడ్డులను, వడలను, దోసెలను, జిలేబీలను, తేనెతొళ అనే మురుకులను, అప్పాలను, క్షీరాన్నం పాయసం, కదంబం, మొళహోర, పొంగళ్లు, సీరా, కేసరి** మున్నగు అన్న ప్రసాదాలను సుష్టుగా ఆరగిస్తాడు.

భోజన ప్రియుడైన శ్రీనివాసప్రభువు నిత్యమూ **"తోమని పళ్లాల్లో"** ఆరగిస్తాడట! ఒకసారి భోజనం చేసిన పళ్లాన్ని కడగకుండా పారవేస్తారు. భోజనానికి మళ్లీ కొత్త పళ్లెం ఉపయోగిస్తారు విచిత్రంగా ఉందికదూ! అవేమంటే **"మట్టికుండలు".** అది కూడ సగం పగిలినమట్టికుండ. అదే ఓటి కుండ – దాన్నే **'ఓడు'** అంటారు. ప్రతిరోజు 'ఓడు'లో మాత్రమే ఆరగించే ఆనందనిలయుని వేభోగం వైభవం ఇదా అని ఆశ్చర్యపోక తప్పదుమరి! ఇలా ఏది తిన్నా, ఎన్నెన్నిటిని తిన్నా తన భుక్తశేషాన్ని మళ్లీ భక్తులకే ప్రసాదిస్తాడు. వాటిని తిన్న భక్తులకు తుష్టీ, పుష్టీ, సంతుష్టితోపాటు సమస్త కోరికలు తీరుతున్నాయి. సంపూర్ణ ఆరోగ్యం కలుగుతున్నది.

## వింత వింత మొక్కుబళ్లు

'పుర్రెకో బుద్ధి జిహ్వకో రుచి' అన్నట్లు ఎన్నెన్ని పుర్రె లున్నాయో, వాటి ఆలోచనలు మరెన్నెన్ని ఉన్నా, ఆ ఆలోచనలకు తగ్గట్లు అభిరుచులు ఉన్నా, ఆ అన్నింటి ఆలోచనలకు, అభిరుచులకు తగిన దేవుడు తిరుమలేశుడు.

భక్తులు ఆచార వ్యవహారాలు వేర్వేరు అయినా, వారి భాషలు ఒక్కటి కాకపోయినా, మొక్కులను వింత వింతలుగా చెల్లించినా వాటినన్నింటిని ప్రీతిగా స్వీకరించి, వారి వారి కోరికలను తీరుస్తున్న స్వామి తిరుమలేశుడు!

అసలు మొక్కుబళ్ల మిషతోనే తన దగ్గరికి రప్పించుకుంటాడట శ్రీనివాసుడు. మొక్కబళ్ల సమర్పణలో ఆడామగా, చిన్నా పెద్దా తేడాలేకుండా మొక్కులుగా, కొందరు నిలువుదోపిళ్లిస్తారు. తలచిక్కులను

ఇస్తారు. తల చిక్కులను స్వీకరించి, జీవితంలోని చిక్కులను తీర్చే విచిత్రమైన స్వామి వేంకటేశుడు.

సామాన్యులే కాక మాన్యులు, అసామాన్యులు కూడా దేవుడికి మొక్కులు చెల్లించారు.

విజయనగరచక్రవర్తి శ్రీకృష్ణరాయలు 1513 నుండి 1521 వరకు ఏడుమార్లు తిరుమలయాత్ర చేసి, నవరత్నఖచిత హారాలను, పాల ఆరగింపు కోసం బంగారు గిన్నెలను, మకరతోరణాన్ని బంగారు విమానపూతను మొక్కుబళ్లుగా సమర్పించినాడట! అచ్యుతరాయలు వెంకటపతిరాయలు, ఎన్నో మొక్కులు చెల్లించారు.

అంతకు పూర్వం 614లో **పల్లవరాణి సామమై** వెండి శ్రీనివాసుని చిన్న విగ్రహాన్ని మొక్కుగా సమర్పించి, బ్రహ్మోత్సవాలకు ముందుగా ఊరేగించేట్లు ఏర్పాటు చేసిందట.

**తులాభారాలు, ఆలయప్రదక్షిణలు, అంగప్రదక్షిణలు అఖండ దీపారాధనలు...** ఇలా శ్రీస్వామివారికి సమర్పింపబడే మొక్కులు ఎన్నెన్నో! ఎవరికెరుక.

### విచిత్రమైన వరాలు - ఆనందకరమైన లీలలు

కొండలరాయడు 'కోరిన వరాల రాయడు'. అన్నమయ్య అన్నట్లు

**"ఏమివలసిన ఇచ్చు ఎప్పుడైనను**
**ఏమరక కొలిచిన ఇతడే దైవము"**

కొందరికి కన్నులిస్తాడు, కాళ్లిస్తాడు. పనిచేయ చేతు లిస్తాడు. మాట లిస్తాడు. ప్రాణమిస్తాడు. పదవులిస్తాడు. కడుపును నింపుతాడు. కడుపును పండిస్తాడు.

**'శ్రీనివాసా! బహూక్త్యా కిం?**
**భక్త సర్వార్తినాశనే**

**సర్వార్థ పూరణే చాపి**
**త్వత్సమోందే న కుత్రచిత్"**

అయ్యా! భక్తులకు "అవి ఇస్తావు, ఇవి ఇస్తావు" అని పొగడడం దేనికి? భక్తుల సర్వార్తులను పోగొడుతూ, సర్వార్థాలను ప్రసాదించే నీలాంటి దేవుడు ఈ బ్రహ్మాండంలో ఎక్కడా లేదు, కనపడదు కదయ్యా స్వామీ! అని పొగడబడుతున్నాడు తిరుమలేశుడు.

తిరుమల క్షేత్రానికి, తర్వాతి కాలంలో శేషాద్రి, గరుడాద్రి, వేంకటాద్రి, నారాయణాద్రి, వృషభాద్రి, వృషాద్రి అంజనాద్రి అనే ప్రధానమైన ఏడు పేర్లు ఏర్పడ్డాయి. అందువల్లే ఈ క్షేత్రం 'ఏడుకొండలు' అనీ 'సప్తగిరులు' అని పిలువబడుతున్నది. కేవలం ఈ ఏడుపేర్లే గాక ఈ క్షేత్రానికి ఎన్నెన్ని పేర్లు ఉన్నాయో లెక్కపెట్టి చెప్పడం కూడా చాలా కష్టం.

అలాగే ఈ పుణ్యక్షేత్రంలో దర్శనం ఇస్తూ ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామికి "ఏడుకొండలవాడు, శేషాచలపతి, శ్రీవేంకటపతి, అంజనాద్రీశ్వరుడు, వృషభాద్రీశ్వరుడు, తిరుమలేశుడు, శ్రీనివాసుడు అనీ ఇలా అనేకమైన పేర్లు కలిగాయి.

భక్తుల కోసమే శ్రీ వైకుంఠం నుండి దిగి వచ్చిన శ్రీవేంకటేశ్వరస్వామిని స్మరిస్తే చాలు ! పాపాలు అన్నీ పోతాయి. ఆ దేవుణ్ణి స్తుతిస్తే చాలు! కోరికలన్నీ తీరుతాయి. ఆ దేవదేవుణ్ణి సందర్శిస్తే చాలు ! ముక్తి కలుగుతుంది. అట్టి శ్రీనివాసభగవానుణ్ణి నిత్యమూ భజిస్తూ, ఆ స్వామివారినీ, ఆయన కొలువై వున్న తిరుమల క్షేత్రాన్ని గూర్చి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

**శ్లో॥ స్మరణా త్సర్వపాపఘ్నం స్తవనా దిష్టవర్షిణం**
**దర్శనా న్ముక్తి దం చేశం శ్రీనివాసం భజేఽనిశమ్**

* * *

## 5. తిరుమల క్షేత్రం - సంక్షిప్త గాథ

తిరుమల క్షేత్రంలో వేంకటేశ్వరస్వామికంటె ముందు 'ఆదివరాహస్వామి ఉండినాడట! అందువల్ల ఇది ఆదివరాహక్షేత్రం అని పిలువబడుతున్నది. ఆదివరాహస్వామి ఎవరు? ఇక్కడికి ఎందుకొచ్చాడు? ఎప్పుడు వచ్చాడు అని తెలుసుకోవాలంటే మాత్రం వేల సంవత్సరాలకు పూర్వం జరిగిన కథను చెప్పుకోవాల్సిందే మరి!

### వరాహావతారం

ఒకప్పుడు బ్రహ్మదేవుడు సృష్టి చేస్తూ చేస్తూ బాగా అలసిపోయాడు. పాపం! అలా అలసి సొలసి వున్న బ్రహ్మకు నిద్ర ముంచుకొచ్చింది. ఇంతలో ఆయన సృష్టి అంతా అల్లకల్లోలమయి, జలప్రళయం ఏర్పడింది, ఇదే అదను అనుకొన్న హిరణ్యాక్షుడు అనే రాక్షసుడు భూమిని సముద్రం అడుక్కి తీసుకెళ్లాడు. ఆ భూగోళాన్ని తంతూ, ఎగరేస్తూ నానా గందరగోళం చేశాడు. ఇంతలో నిద్ర మేల్కొన్న బ్రహ్మదేవుడు రక్షించమని మహావిష్ణువును శరణు వేడాడు.

వెంటనే విష్ణు భగవానుడు పెద్దవరాహరూపాన్ని ధరించి, హిరణ్యాక్షుణ్ణి వధించి తన కోరలతో భూదేవిని ఉద్ధరించి రక్షించాడు. ఆ స్వామి వరాహ రూపంతో చేసిన ఘనకార్యాన్ని దేవతలంతా పొగడుతూ, "ఓ వరాహస్వామీ భూదేవితోకూడా ఇక్కడే వుండి అందర్నీ రక్షించుమని ప్రార్థించారు.

సరే! అంటూ వరాహస్వామి, గరుత్మంతునితో వైకుంఠంతోపాటు, అక్కడవుండే సరస్సును తెప్పించి ఇక్కడ స్థాపించాడు. ఆనాటినుంచి అది **"ఆదివరాహక్షేత్రం"** అనీ ఆ సరస్సు **"స్వామిపుష్కరిణి"** అనీ పిలువబడుతున్నది. ఇదీ ఆదివరాహక్షేత్ర గాథ!

ఆ తర్వాత కొన్ని వేల ఏండ్ల తర్వాత ఈ క్షేత్రానికి శ్రీవేంకటేశ్వరస్వామి వచ్చాడు. అసలు ఆ స్వామి ఎందుకు వచ్చాడో, వచ్చిన వాడు ఇక్కడే ఎందుకు నిలబడ్డాడో కూడ తెలియ జెప్పుకొందామా మరి!

## యాగం ఎవరి కోసం!

పూర్వం ఒకప్పుడు పవిత్రమైన గంగానది ఒడ్డున మునులు చాలమంది ఒక్కచోట చేరారు. వాళ్లు లోకకల్యాణం కోసం ఒక యాగాన్ని చెయ్యడానికి తలపెట్టారు. ప్రారంభించారు కూడా 'వేదమంత్రాలమధ్య, మంగళ వాద్యాలు మోగింపబడుతుండగా ఆ యజ్ఞం కోలాహలంగా ప్రారంభం అయ్యింది.

ఇంతలో నారాయణ! నారాయణ!! అంటూ ఆకాశంనుంచి ఊడిపడ్డట్టుగా, నారదమహర్షి అక్కడ ప్రత్యక్షమయ్యాడు.

అబ్బ! కలహ భోజనుడైన నారదుడు వచ్చాడు. ఈ యాగం సాగదు గాక సాగదు అనుకొన్నారు కొందరు ఋషులు. లోకక్షేమం కోసం శుభప్రదంగా యాగం ప్రారంభమైన వేళ దేవర్షి రావడం శుభశకునం అనుకొన్నారు మరికొందరు మునులు.

నారాయణ! నారాయణ!! అన్న నారదుడి నారాయణ నామస్మరణంతో అందరి ఆలోచనలు ఆగిపోయాయి. అందరూ లేచి నిలబడి నమస్కరిస్తూ నారదుడికి స్వాగతం పలికారు, ఆతిథ్యమిచ్చారు.

వారి సత్కారానికి సంబరపడిపోతూ నారదుడు ఇలా అన్నాడు. మహర్షులారా! మీరంతా ఇక్కడ ఏం చేస్తున్నారు, అని ఆసక్తిగా అడిగాడు.

అయ్యా! దేవర్షీ! మేం ఒక యాగాన్ని ప్రారంభించాం ఈ యజ్ఞంవల్ల జగత్కల్యాణం కలగాలన్నదే మా ఉద్దేశం. సరిగ్గా ఈ సమయంలో మీరు రావడం ఆనందదాయకం, మా కార్యానికి ఆశీస్సులందించండి అంటూ చేతు లెత్తి దండం పెట్టారు.

నారాయణ! నారాయణ!! అంటూ నారదమునీంద్రుడు ఆశ్చర్యంతో ఇలా అన్నాడు. "ఏమిటీ! లోకక్షేమం కోసం యాగం తలపెట్టారా? బాగుంది!

బాగుంది! కాని మీ కోరిక ప్రకారం లోక కల్యాణం కలిగించే దేవుడు ఎవరు? శివుడా? విష్ణువా? బ్రహ్మదేవుడా? ఎవర్ని గూర్చి ఈ హోమం చేస్తున్నారు.

ఈ ప్రశ్నలకు మునులందరూ ఒకరి మొగాలొకరు చూసుకొంటూ అయోమయంలో పడ్డారు.

వాళ్లందరి దీనావస్థను చూసి, మళ్లీ నారదుడే ఇలా అన్నాడు. అయ్యా! దేవతల్లో త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు గొప్పవారు కదా! ఈ ముగ్గురిలోను లోకకల్యాణాన్ని కల్గించే వారెవరు? భక్తులు అడిగిన వెంటనే ఆదుకొనే ఆపద్బాంధవుడు ఎవరు? కోరిన వరాలిచ్చే దేవుడు ఎవరు? స్మరించిన వెంటనే పాపాలను పోగొట్టి, సర్వ శుభాలను ప్రసాదించే పరంధాముడు ఎవరు? అంతేకాదు. ఇక కలియుగం తొందర్లో రాబోతూంది. అది కలుషాలమయం. కలిదోషాలనుండి రక్షించగల దేవాది దేవుడు ఎవరో, ముందుగా నిర్ణయించుకోండి. ఆ తర్వాతే ఆ దేవుణ్ణి గూర్చి యాగం చెయ్యండి! మీ కోరికా తీరుతుంది. తప్పక జగత్కల్యాణం సిద్ధిస్తుంది. అంటూ నారాయణనామ స్మరణంతో నారదుడు అదృశ్యమయ్యాడు.

## ఎవరు గొప్ప!

నారదుడు ఉన్నట్టుండి రావడం, సందేహాన్ని కలిగించి వెళ్లడంతో మునులందరూ కొంచం తేరుకున్నారు. ఆ దేవర్షి అన్నమాట నిజమే కదా. అని చర్చించారు. తర్జన భర్జనకు లోనయ్యారు. త్రిమూర్తుల్లో ఎవరు గొప్పో తేల్చడం ఎలా? అది సులువైన పనేనా? ఎవరు నిర్ణయించగలరు, అని తమలో తాము ఆలోచించుకొని చివరకు ఈ కార్యభారాన్ని భృగుమహర్షికి అప్పగిస్తూ ప్రార్థించారు.

జగత్కల్యాణం కోసం కదా! తప్పతుందా! అనుకొంటూ బయలుదేరాడు భృగుమహర్షి.

## పూజే లేకుండు గాక!

ముందుగా భృగువు సత్యలోకంలో అడుగుపెట్టాడు. సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడి లోకమే సత్యలోకం.

అక్కడ తెల్లని పద్మంలో నాలుగు మొగాలతో వేదాలను వల్లిస్తున్న బ్రహ్మదేవుడు కనపడ్డాడు. ఆ పక్కనే మరొక తెల్లని పద్మంమీద, బ్రహ్మదేవుడి వేదనాదాలకు అనుగుణంగా వీణపై చేతివేళ్లను సుతారంగా మీటుతూ ఉన్న శ్రీ సరస్వతీ దేవి దర్శనమిచ్చింది.

సత్యలోకంలో ప్రవేశించిన భృగుమహర్షికి బ్రహ్మదేవుడి వేదనాదం, సరస్వతీదేవి వీణావాదనం అబ్బురపరచాయి. పరమానందం పొందాడు. వాళ్లకు సాగిలబడి నమస్కరించాడు. అనేక విధాలుగా గట్టిగా స్తుతించాడు. వాళ్లు ఇద్దరూ, తనను చూస్తేగా? తన ప్రార్థనల్ని వింటేగా? వాళ్లిద్దరూ వాళ్లలో వాళ్లు మునిగి పొయ్యారు. కనీసం తనను గమనించినట్లైనా కన్పించరే! ఎంత దేవతలయితే మాత్రం వీళ్లకు ఇంత అహంకారమా!! నాపైన ఇంతటి నిరాదరణా! అంటూ కోపంగా "బ్రహ్మదేవుణ్ణి చూస్తూ, నీకు భూలోకంలో పూజలే లేకుండు గాక! అంటూ శపించి అక్కడినుండి బయటపడ్డాడు.

## స్థాణువుగా వుండు!

సత్యలోకంలో తనకు ఎదురైన నిరాదరణను గూర్చి ఆలోచిస్తూ భృగువు కైలాసంలో ప్రవేశించాడు. వేళ కాని వేళ ఇప్పుడు లోనికి వెళ్లకూడదు. పార్వతీ పరమేశ్వరులు ఏకాంత మందిరంలో ఉన్నారు. ఇప్పుడు లోనికి వెళ్లడం కుదరదు, అంటూ నందీశ్వరుడు అడ్డుకొన్నాడు.

ఆ కోపిష్టిముని నందీశ్వరుణ్ణి ఒక్కతోపు తోసి లోపల జొరబడ్డాడు. అంతే! ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరుల ప్రణయానికి భంగం

వాటిల్లింది, ఇంకేముంది. శివుడు ఎక్కడలేని రౌద్రరూపంతో త్రిశూలంతో అతణ్ణి చంపబోయాడు. వెంటనే పార్వతి అడ్డుపడించి.

బ్రతుకు జీవుడా! అనుకొన్న భృగుమహర్షి కట్టలు తెంచుకొన్న కోపంతో, "తామసుడవైన ఓ శివా! నీవు భూలోకంలో స్థాణువుగా" పడివుండు. నీవు లింగాకారంలో మాత్రమే పూజలందుదువు గాక! అంటూ శపించి విస విసా వెళ్లి పోయాడు.

## అందరి ఆనందాల దేవుడు

మనోవేదనతో భృగుముని వైకుంఠంలో ప్రవేశించాడు. అక్కడ ద్వారానికి ఇరువైపులా కాపలా ఉన్న ద్వారపాలకులు జయ విజయులు ఆ మహర్షిని అడ్డుకున్నారు.

వాళ్ల అడ్డగింపు ఏమీ పని చెయ్యలేదు. భృగుమహర్షి అదుపు లేని ఆవేశంతో వైకుంఠంలోని అభ్యంతరమందిరంలో దూకుడుగా జొరబడ్డాడు.

శేషపాన్పుపై శ్రీమహావిష్ణువు! ఆయన ఎదపై వాలి వున్న శ్రీమహాలక్ష్మి! గుస గుసగా స్వామివారితో ఏదో ముచ్చటిస్తున్న సుందర దృశ్యం. స్వామివారు చిరునవ్వుతో ఆమె మోములో మోము పెట్టి, ఆమె చెబుతున్న దేదో ఆసక్తిగా వింటున్నాడు!

దివ్యమంగళ దంపతులైన శ్రీలక్ష్మీనారాయణులు ఆ ముని ఉక్రోషంతో లోనికి రావడం గమనించినా, ఏమాత్రం గమనించనట్లుగానే వుండినారు.

పాపం భృగువు అనేక విధాలుగా వాళ్లిద్దర్నీ స్తుతించాడు. పొగిడాడు. గట్టిగా పిలిచాడు. అరిచాడు కూడ. ఇప్పటికే సత్యలోకంలోనూ, కైలాసంలోనూ తలకెక్కిన కోపం, ఇక్కడ నిర్లక్ష్యానికి మరింతగా పెరిగింది. ఇంక తాళలేక, పట్టపగ్గాలు లేని ఆవేశంతో శేషశయ్యమై శయనించిన విష్ణువు రొమ్ముపైన కాలితో తన్నాడు. ఈ హఠాత్సంఘటనకు వెంటనే

లక్ష్మీదేవి ప్రక్కకు తొలిగింది. ఆ రుషి కాలు స్వామివారి హృదయానికి తాకింది. వెంటనే విష్ణువు లేచి, ఆ మునిని శాంతపరుస్తూ ఆయనను గమనించకపోవడం తమ పొరపాటు అన్నాడు. అంతేగాదు, ఆ మునిని శేషశయ్యపై కూర్చుండబెట్టి అతని కాళ్లను పిసుకుతూ పాదంలో వుండే అహంకార నేత్రాన్ని నలిపి వేశాడు, వెంటనే ఆ మునీశ్వరుని అహంకారం పూర్తిగా నశించి, తాను చేసిన తప్పిదాన్ని క్షమించమని వేడుకొన్నాడు. శ్రీ మహావిష్ణువే, భూలోకంలో అందరి చేతా పూజింపదగినవాడు, అందరికీ ఆనందాలను పంచి ఇచ్చే దేవుడు అంటూ నిశ్చయించి భూలోకానికి వచ్చి మునులకు చెప్పగా. వాళ్లు ఆ యాగాన్ని విష్ణు పరంగా పూర్తి చేశారు.

తత్ఫలితంగానే శ్రీమహావిష్ణువు "శ్రీవేంకటేశ్వరుడి" పేరుతో శ్రీవైకుంఠంనుండి భువికి తరలివచ్చాడు. అదెలా జరిగింది. అంటే!

## వైకుంఠాన్ని వీడిన లక్ష్మిదేవి

ఎల్లప్పుడు తాను వీడకుండా వుండే విష్ణువుహృదయస్థానాన్ని తన్ని అపవిత్రం చేసిన భృగుమహర్షిపై కోపించకుండా, శిక్షించకుండా, ఆదరించి, పంపడం శ్రీమహాలక్ష్మికి ఏమాత్రం నచ్చలేదు, వివరీతమైన కోపంతో అలిగింది. విష్ణువు బ్రతిమాలినా వినకుండా లక్ష్మీదేవి వైకుంఠాన్ని వీడి పాతాళ లోకంలోని కపిలమహాముని ఆశ్రమం చేరుకొని తపస్సు చేస్తూ ఉండింది. మళ్లీ కొంతకాలానికి దేవతల కోరికపై భూలోకంలో కొల్హాసురుడు, కరవీరుడు అనే రాక్షసులను సంహరించి కొల్హాపురక్షేత్రంలో "శ్రీమహాలక్ష్మి"గా నిలిచి ఉంది.

ఆ తర్వాత లక్ష్మీదేవి లేని వైకుంఠంలో ఉండలేని విష్ణువు కూడా ఆమెను వెదుకుతూ చివరకు ఆమె కనపడక భూలోకంలోని ఆదివరాహ క్షేత్రం చేరుకొన్నాడు. ఆకలిదప్పులతో అలమటిస్తూ నిలువ నీడలేక తిరుగుతున్న విష్ణువునకు ఈ క్షేత్రంలో "స్వామిపుష్కరిణీ తీర్థం", దానికి దక్షిణాన చింత

చెట్టూ, దాని కింద ఒక పెద్ద పుట్ట కనపడ్డాయి. పెద్ద గుహలాగా ఉన్న ఆ పుట్ట తొర్రలో తలదాచుకున్నాడు విష్ణుదేవుడు.

పుట్టలో దాక్కొన్న పరంధాముని దీనావస్థను చూచారు బ్రహ్మదేవుడు, పరమశివుడు. వారు ఇరువురూ కొల్హాపుర క్షేత్రం చేరుకొని శ్రీమహాలక్ష్మికి, స్వామివారి పరిస్థితిని వివరించి, ఆయనను చేరుకోమని చెప్పారు.

కాని ఆమె ఏమాత్రం వినవే లేదు. కనీసం ఆయన ఆకలి దప్పులైనా తీర్చడానికి ఆమెను ఒప్పించారు. ముగ్గురూ వరాహ క్షేత్ర ప్రాంతానికి చేరుకొన్నారు. బ్రహ్మదేవుడు గోవుగా, శివుడు దూడగా, లక్ష్మీ దేవి గోపాలికగాను మారి, వాటిని ఆ ప్రాంతపు పాలకుడు చోళరాజుకు విక్రయించి వెళ్లిపోయింది.

రాజుగారి పసులమందలో కొత్తగా చేరిన ఈ ఆవూ దూడ ప్రతిరోజు పసులకాపరి కన్ను గప్పి వరాహ క్షేత్రంలోని పుట్టలో వున్న దేవుడికి పాలు కారుస్తూ ఆకలి తీరుస్తుండేవి. ప్రతిరోజు పుట్టలోవున్న స్వామివారికి పాలు కారుస్తున్నందువల్ల, ఇంటివద్ద ఆవు పాలు ఇచ్చేది కాదు. ఇలా ఎందుకు జరుగుతోందో తెలుసుకోవాలన్న ఆసక్తితో పసులకాపరి మాటు వేశాడు.

అంతే! మరునాడు కొండపైన పుట్టలో పాలను కారుస్తున్న ఆవును చూచి మండిపడ్డాడు గొల్లవాడు. కోపంతో ఆవుపైకి గొడ్డలిని విసిరాడు. ఆవు బెదిరి పక్కకు తొలగింది, ఈ అలజడికి పుట్టనుండి పైకి లేచిన శ్రీనివాసుడికి గొడ్డలి బలంగా నుదురుపైన తాకి గాయమై నెత్తురు కారింది. ఉన్నఫళంగా నెత్తురు కారుతూ ఉన్న దివ్యపురుషుడు కనపడ్డంతో దిగ్భ్రమతో ఆ గొల్లవాడు మరణించాడు.

ఈ విషయాన్ని తెలుసుకున్న చోళరాజు పుట్ట దగ్గరికి వచ్చి జరిగిన పొరపాటుకు క్షమించమని శ్రీనివాసుణ్ణి వేడికొన్నాడు. చేసిన పాపానికి

శిక్ష తప్పదు. అంటూ శ్రీనివాసుడు చోళరాజును పిశాచివిగా కమ్మని శపించాడు. ప్రాధేయపడిన రాజుపై కరుణతో, త్వరలోనే ఆకాశరాజు పుత్రిక పద్మావతిని వివాహమాడుతాననీ ఆ సందర్భంలో రాజు కానుకగా తనకు ఒక బంగారు కిరీటాన్ని ధరింప చేసిన వెంటనే శాపవిముక్తి అవుతుందని వరమిచ్చాడు శ్రీనివాసుడు.

పిదప ఈ భూలోకంలో మొదట దర్శించిన గొల్లవాని సంతతివారికి స్వామివారు కలియుగాంతవరకు ప్రతిరోజు తొలిదర్శనాన్ని వరంగా ప్రసాదించాడు.

ఆ తర్వాత అక్కడే తిరుగుతున్న శ్రీనివాసునికి వరాహస్వామి కనపడ్డాడు. తన గాథనంతా వినిపించి, తాను ఉండడానికి నూరు అడుగుల స్థలాన్ని దానంగా ఇవ్వవలసిందని అడిగాడు. అందుకు ప్రతిఫలంగా కలియుగాంతం వరకు, భక్తులు మొదట వరాహస్వామిని దర్శించిన తర్వాతే తనను దర్శించాలని, అలాగే ప్రతిరోజు తొలిపూజ, తొలినివేదన వరాహస్వామికి జరగాలన్న కట్టడి చేశాడు శ్రీనివాసుడు.

అందుకు అంగీకరించిన వరాహస్వామికూడ ఆ దానంతోపాటు, శ్రీనివాసుని సేవలో "వకుళమాత"ను నియోగించాడు.

వకుళమాత ఎవరు ? ఆమెనే వరాహస్వామి శ్రీనివాసుని సేవకు ఎందుకు నియోగించాడో మనకు అర్థం కావాలంటే మాత్రం ద్వాపరయుగంనాటి, కథను తెలుసుకోవాల్సిందే.

## వకుళమాతే యశోద

ద్వాపరయుగంలో చిన్ని కృష్ణుణ్ణి పెంచి పెద్ద చేసిన తల్లి యశోద! చిన్ని కృష్ణుని లీలల్ని దర్శించిన యశోద శ్రీకృష్ణునికి ఒక్కపెళ్లైనా చెయ్యలేకపోయింది. కనీసం ఆయన పెళ్లిని చూసే భాగ్యం అయినా పొందలేక పోయింది.

పాపం ఆమె బాధను చూసిన కృష్ణయ్య "అమ్మా! కలియుగంలో నేను శ్రీనివాసుడిగా వస్తాను. ఆకాశరాజు కూతురు పద్మావతిని నేను వివాహం చేసికుంటాను. ఆ పెండ్లి నీ చేతుల మీదుగానే జరుగుతుంది అని వరమిచ్చాడు. అప్పటి యశోదే ఇప్పటి వకుళమాత!

వకుళమాత శ్రీనివాసుణ్ణి తన కన్న బిడ్డలాగా చూసుకుంది. శ్రీనివాసుడు మరొక్కమారు మాతృప్రేమను చవి చూశాడు.

ఒక రోజు శ్రీనివాసుడు వేటకోసం కొండల్లోకి వెళ్లాడు. అక్కడ అడవి ఏనుగుచేత తరుమబడుతున్న ఆకాశరాజు కూతురు పద్మావతి కనిపించింది. ఆ ఏనుగు బారినుండి రక్షించిన శ్రీనివాసుడు ఆమె మోహంలో పడ్డాడు. ఆమె వెంట వున్న చెలికత్తెలు శ్రీనివాసునిపై రాళ్లు విసరుతూ తరిమికొట్టారు. నెత్తురోడుతున్న గాయాలతోవచ్చిన శ్రీనివాసుణ్ణి చూచి వకుళమాత ఆందోళనపడింది.

జరిగిన కథనంతా చెబుతూ ఆకాశరాజు కూతురు పద్మావతీ తాను పరస్పరం ప్రేమించుకున్నామనీ, ఆమెను పెళ్లి చేసుకొనడానికి ఆకాశరాజుతో మాట్లాడి రమ్మని వకుళమాతను కోరాడు శ్రీనివాసుడు.

కొండల్లో తిరిగే తామెక్కడ? ఆకాశరాజు కూతురు ఎక్కడ? ఇద్దరికీ పొంతన ఎలా కుదురుతుంది. అని సందేహిస్తున్న వకుళమాతతో అమ్మా ద్వాపరయుగంనాటి యశోదవు నీవు. అప్పటి కృష్ణుణ్ణే నేను.

అంతే కాదు, ఆకాశరాజు పుత్రిక పద్మావతే త్రేతాయుగం నాటి వేదవతి.

## వేదవతే పద్మావతి

సీతా రామలక్ష్మణులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో రావణాసురుడు సీతను అపహరించాడు. ఆ సమయంలో అగ్ని దేవుడు ఎదురై రావణా! ఈమె ఎవరు? అని అడిగాడు. ఈమె సీతాదేవి. అన్నాడు

రావణుడు. కాదు సీతకాదు. అసలు సీత నాదగ్గర వుంది అంటూ వేదవతిని చూపించాడు. రావణాసురుడు అగ్ని దగ్గర వున్న వేదవతిని తీసుకెళ్లాడు. లంకలో సీత బదులుగా వేదవతి వుండింది. మళ్లీ రావణసంహారం అయినతర్వాత సీత అగ్ని ప్రవేశం చేసిన సమయంలో, అగ్ని గుండం నుంచి సీతరూపంలో వున్న ఇద్దరు స్త్రీలు బయటికి వచ్చారు.

ఆశ్చర్యపోయిన శ్రీరామచంద్రునితో అగ్ని దేవుడు ప్రత్యక్షమై రామచంద్రా! ఇంతవరకు లంకలో వున్నది ఈ వేదవతి. అసలు సీత ఇదిగో నాదగ్గర వుంది. అని చూపించాడు. వెంటనే సీతాదేవి రామునితో నాకోసం లంకలో కష్టాలను అనుభవించిన వేదవతిని వివాహం చేసుకొమ్మని అడిగింది.

ఈ అవతారంలో నేను ఏకపత్నీ వ్రతుణ్ణి, కలియుగంలో వేంకటాచలపతిగా అవతరించిన వేళ, ఈమె ఆ కాశరాజు కూతురు పద్మావతి పేరుతో అవతరిస్తుంది, అప్పుడు ఆమెను వెళ్లి చేసుకొంటానని రాముడు వరం ఇచ్చాడు. ఆ రాముణ్ణే నేను, ఆ వేదవతే ఈ పద్మావతి!

వేదవతి కూడ లక్ష్మీ అవతారమే. మయుడు అనే వేదపండితుడు ఎప్పుడు వేదాధ్యయనం చేస్తుండగా ఒకసారి ఊర్వశి అనే అప్సరస కంటబడింది. ఆమెను చూసిన ఆ విప్రుడు కామ ప్రేరితుడు కాగా అతనికి ఇంద్రియ పతనమయ్యింది. అందులో నుండి 'లక్ష్మీదేవి' శిశువుగా అవతరించింది. వేదం వల్లిస్తుండగా పుట్టిందికనుక 'వేదవతి' అనే పేరు పెట్టుకొన్నాడు. అదీ ఇప్పటి పద్మావతి గాథ! అంటూ వకుళమాతతో శ్రీనివాసుడు వివరించాడు.

## శ్రీనివాసకల్యాణం

ఈ గాథనంతా విన్న వకుళమాత ఆనందంతో ఆకాశరాజు దగ్గరికి వెళ్లి పద్మావతీ శ్రీనివాసుల కల్యాణానికి మధ్యవర్తిత్వం నిర్వహించింది.

వైశాఖమాసం శుక్ల పక్షం దశమీ శుక్రవారం ఉత్తరఫల్గుణీ నక్షత్రం కూడిన శుభలగ్నంలో శ్రీపద్మావతీ శ్రీనివాసుల కల్యాణం ఆకాశరాజు రాజధాని నారాయణవరంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఆ వివాహ వేడుకలకు బ్రహ్మేంద్రాది దేవతలు, సమస్తలోకాలవాసులు వచ్చారు. అష్టదిక్పాలకులు వచ్చారు. సూర్యుణ్ణి పంపించి కొల్హాపురం నుంచి శ్రీమహాలక్ష్మిని కూడా ఈ పిలిపించారు.

పార్వతీ, సరస్వతీ, లక్ష్మీదేవి దగ్గరుండి వేంకటేశ్వరుణ్ణి పెళ్లి కొడుకును చేసి ఘనంగా పెండ్లి చేయించారు. అంగరంగవైభవంగా పెండ్లి వేడుకలు పూర్తి అయిన తర్వాత ఎవరు చెప్పినా వినక మహాలక్ష్మి మళ్లీ కొల్హాపురం చేరుకుంది.

నూతనదంపతులైన పద్మావతీ శ్రీనివాసులు వేంకటాచలక్షేత్రానికి వెళుతూ ఆరునెలల పాటు సువర్ణముఖీ తీరంలోని అగస్త్యాశ్రమంలో ఉండినారు. ఆ తర్వాత వరాహక్షేత్రం చేరుకొన్న వారిద్దరు తొండమానురాజు వాస్తు శాస్త్రరీత్యా ఆనందనిలయమనే బంగారు శిఖరంతో నిర్మించి ఇచ్చిన, దివ్యభవనంలో పద్మావతీ శ్రీనివాసులు గృహ ప్రవేశం చేశారు. తొండమానుడు శ్రీనివాసునికి పరమభక్తుడే కాకుండా ఆకాశరాజుకు తమ్ముడు కూడా

ఆదివరాహ క్షేత్రం చేరుకొన్న శ్రీనివాసుడు, లక్ష్మీదేవి లేదే అని చింతిస్తూ ఆమెను తిరిగి పిలుచుకరావడానికి కొల్హాపురం వెళ్లాడు. అక్కడ ఆమె అనుగ్రహంకోసం పది ఏండ్లపాటు తీవ్రంగా తపస్సు చేశాడు. కాని ఆ జగన్మాత దర్శనం కాలేదు. ఇంతలో ఆకాశవాణి ఇలా విన్పించింది.

'శ్రీనివాసా! ఈ అవతారంలో శ్రీమహాలక్ష్మి నిన్ను చేరదు. నీవు వేంకటాచల క్షేత్రానికి తిరిగి వెళ్లు, ఆ క్షేత్రానికి దక్షిణాన సువర్ణముఖీ

తీరంలో శుకమహర్షి ఆశ్రమం తీరాన ఒక పద్మ సరుస్సు ఏర్పాటు చేసి, లక్ష్మి కోసం తపస్సును శ్రద్ధగా ఆచరించు. ఆ పద్మ సరోవరంలో సాక్షాత్తు లక్ష్మి అవతరిస్తుంది.

ఆకాశవాణి చెప్పిన ప్రకారం శ్రీనివాసుడు శుకమహర్షి ఆశ్రమ తీరాన ఒక పద్మ సరస్సును నిర్మించాడు అందులోని పద్మాలు వికసించి వుండడానికి సూర్యభగవానుణ్ణి ప్రతిష్ఠించాడు. పన్నెండేళ్లపాటు మహాలక్ష్మి కోసం తపస్సు చేశాడు.

ఒకనొక కార్తికమాసం శుక్లపక్షంలో పంచమీ శుక్రవారం ఉత్తరాషాఢ నక్షత్ర అభిజిత్ లగ్నంలో సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి పదహారేళ్ల యువతిగా సరోవరంలో బంగారు పద్మంలో అవతరించింది. పద్మంలో ఆవిర్భవించింది కనుక 'పద్మావతి' అనీ, పద్మంపై ప్రకాశించే వనిత కనుక 'అలమేలుమంగ' అనీ భక్తుల చేత పిలువబడింది. ఆ జగన్మాతను బ్రహ్మాది దేవతలు అనేక విధాలుగా స్తుతించారు.

శ్రీనివాసుడు పద్మావతి మెడలో తన కలువల హారాన్ని వేశాడు. తన వక్షః స్థలంలో వ్యూహలక్ష్మిగా చేసుకొని తిరుమల క్షేత్రానికి బయలు దేరాడు. ఇంతలో దేవతలంతా ఈ పద్మసరోవరతీరాన అర్చామూర్తిగా పూజలందుకొమ్మని ప్రార్థించారు. మహారాజ్ఞిగా, స్వతంత్ర వీరలక్ష్మిగా పద్మావతి పేరుతో పూజలందుకుంటున్నది శ్రీలక్ష్మీదేవి

తిరుమల చేరుకొన్న శ్రీనివాసుడు ఆకాశ రాజు కూతురు పద్మావతిని కూడ తన హృదయంలోని వక్షఃస్థలవ్యూహలక్ష్మితో మిళితం చేసుకొన్నాడు.

దేవతల కోరికపై కలియుగాంతవరకు తిరుమల క్షేత్రంలో వెలసివుంటానని వక్షః స్థల లక్ష్మితో నిలిచివున్న శ్రీనివాసునికి బ్రహ్మదేవుడు బ్రహ్మోత్సవాలను నిర్వహించాడు.

## శిలగా మారిన శ్రీనివాసుడు

ఒకనాడు భక్తుడైన తొండమానుడు రహస్యమార్గం గుండా ఆనందనిలయంలో ప్రవేశించి శ్రీవేంకటేశ్వరుణ్ణి కాపాడుమని శరణువేడినాడు. అసలు ఏమి జరిగిందని అడిగాడు ఆనందనిలయుడు.

"రెండేండ్ల క్రిందట ఒక విప్రుడు అతని భార్యాపిల్లల్ని తనకు అప్పచెప్పాడనీ, కాని తన మతిమరపుతో పొరపాటు జరిగినందువల్ల వాళ్లంతా మరణించారనీ. ఇప్పుడు ఆ విప్రుడు తిరిగి వచ్చాడు. శ్రీనివాసుని దర్శనానికి వెళ్లారని అసత్యం పలికాను" అంటూ తన దీన గాథను చెప్పాడు తొండమానుడు.

అయ్యా! నీకు బ్రహ్మ హత్యాపాపం చుట్టుకొందే, సరే, నీ కోసం ఆ పాపాన్ని నేనే భరిస్తాను. ఇక మీదట ఎవరికీ దర్శనం ఇవ్వను, మాట్లాడను" అంటూ ఆ స్వామి వారు ఆ విప్రకుటుంబాన్ని బ్రతికించాడు.

ఆనాటినుంచి "వక్షఃస్థల వ్యూహలక్ష్మి"తో శ్రీనివాసుడు "కలౌ వేంకట నాయకః" అనే ప్రసిద్ధితో ఈ కలియుగంలో పిలిస్తే పలికే ప్రత్యక్ష దైవంగా "కోరిన వరాలరాయడిగా సార్థక నామధేయంతో వరలుతూ సాలగ్రామ శిలా విగ్రహమూర్తిగా ఆవిర్భవించి దర్శనమిస్తున్నాడు.

అదే భూలోక వైకుంఠంగా భాసిల్లుతున్న తిరుమల కొండ.

**కట్టెదుర వైకుంఠము కాణాచయనకొండ!!**
**తెట్టెలాయి మహిమలే తిరుమల కొండ!!**

శ్రీవేంకటేశ్వరుడు అర్చామూర్తిగా వెలసిననాటినుండి ఈ క్షేత్రంలో ఎన్నో ఉత్సవాలు, మరెన్నో సేవలు జరుగుతున్నాయి, వాటిని గూర్చి సంగ్రహంగా తెలుసుకుందాం.

* * *

## 6. తిరుమలేశుని సేవలో తరించిన భక్తులు

తిరుమలక్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన నాటినుండి ఎందరెందరో భక్తులు ఎన్నోవిధాలుగా సేవలు చేస్తూ తరించారు. వారిలో కొందరి భక్తుల దివ్యగాథలను సంగ్రహంగా తెలుసుకుందాం.

### తొండమానుడు - భీముడు

తొండమానుడు చక్రవర్తి. భీముడు తిరుమలేశుని నివేదనకుగాను వండే కుండలను తయారు చేసే కుమ్మరివాడు. వీరు ఇద్దరూ శ్రీవేంకటేశ్వరస్వామికి పరమ భక్తులు. వీరి కథల్ని సంక్షిప్తంగా వివరించుకుందాం.

తిరుపతికి దగ్గర్లో నారాయణవరం అనే క్షేత్రం ఉంది. పూర్వం పెద్దనగరంగా వున్న రోజుల్లో దాన్ని ఆకాశరాజు పాలించేవాడు. ఈ రాజుగారి కూతురే పద్మావతి. ఆకాశరాజు ఆమెను వేంకటేశ్వరునికి ఇచ్చి పెళ్లి చేశాడు. ఈ రాజు తమ్ముడే తొండమానుడు.

చిన్నమామే, కాక పరమభక్తుడైన తొండమానురాజు తిరుమలలో 'ఆనందనిలయం' అనే పేరుగల బంగారు భవనాన్ని కట్టించి శ్రీనివాసునికి ఇచ్చాడు.

ఒకప్పుడు తొండమానునికి బ్రహ్మహత్యా పాపం చుట్టుకొంది. దానికి కారణం ఒక విప్రకుటుంబం. ఒక విప్రుడు కాశీయాత్రకు పోతూ తన భార్యా పిల్లలను తొండమానురాజుకు అప్పజెప్పి, తాను తిరిగి వచ్చేవరకు వాళ్లను రక్షించుమని చెప్పాడు. సరే! నన్నాడు రాజు. కాని కొంతకాలానికి వారి సంగతే పూర్తిగా మరచి పోయాడు. పాపం వాళ్లు తిండీ, తిప్పలు లేక మరణించారు. కొంతకాలానికి కాశీనుండి తిరిగి వచ్చిన విప్రుడు తన భార్యాపిల్లల సంగతిని అడిగాడు.

అప్పుడు జ్ఞాపకం వచ్చిన తొండమానుడు వాళ్లు మరణించిన సంగతిని తెలుసుకొని బాధపడ్డాడు. కాని వాళ్లందరూ వేంకటేశ్వరస్వామి దర్శనానికి

తిరుమలకొండకు వెళ్లారు. రేపు వస్తారని అసత్యం పలికాడు. వెంటనే తిరుమల కొండకు వెళ్లి శ్రీనివాసుని కాళ్లమీద పడ్డాడు. ఎలాగైనా వాళ్లని బ్రతికించుమని ప్రాధేయపడ్డాడు. శ్రీనివాసుడు ఆ కుటుంబాన్ని బతికించాడు. కాని ఆ పాపం పోవడానికి వేయి బంగారు పువ్వులతో తనకు సహస్రనామార్చన చెయ్యమని స్వామి రాజును ఆదేశించాడు.

వేంకటేశ్వరుడు ఆనతి ఇచ్చినట్లుగా ప్రతిరోజు బంగారు పూలతో అర్చన చేయించేవాడు తొండమానుడు. ఆ రాజుకు చుట్టుకొన్న బ్రహ్మహత్యాపాపం పోయింది.

కాని "నాలాంటి భక్తుడు ఎక్కడైనా వుంటాడా! ఒకవేళ వున్నా, నాలాగా ప్రతి రోజు బంగారుపూలతో అర్చించే భక్తుడు, ఎక్కడా కనపడదు గాక కనపడదు" అని తొండమానునికి అహంకారం కలిగింది. అంతే! మరునాడు ఆలయం వాకిళ్లు తెరచి చూడగా స్వామివారి పాదాలమీది బంగారు పూలన్నీ దూరంగా తొలగిపోయి అక్కడ కేవలం ఐదారు మట్టిపూలు మాత్రం కనపడ్డాయి.

అది చూచిన అర్చకులు, తొండమానుడు ఆశ్చర్యపడి ఆందోళనతో వేంకటేశ్వరస్వామిని ప్రార్థించారు. వెంటనే స్వామివారు ఇలా అన్నాడు "రాజా! నేనే పరమ భక్తుణ్ణి, బంగారు కమలాలతో పూజిస్తున్నాను అని అహంకారంతో విర్రవీగుతున్నావు. జాగ్రత్త! నీకంటే పరమ భక్తులు ఎందరో ఉన్నారు. వాళ్లల్లో భీముడు అనే కుమ్మర భక్తుడు సమర్పించిన మట్టి పూలే ఇవి! నీ బంగారు పూలకంటే ఆ మట్టి పూలే నాకు చాల ఇష్టం. తెలిసిందా! ఆ భక్తుణ్ణి చూచి, అహంకారం తగ్గించుకో! అంటూ స్వామి ఇంకా ఇలా అన్నాడు.

తిరుమల కొండకు ఒక యోజనం దూరంలో (10 మైళ్లు) వున్న పల్లెలోని పూరి గుడిశలో వున్నాడు భీముడు. నిరంతరం పొద్దుట్నుంచీ

సాయంత్రం దాకా నాకు (శ్రీనివాసుడు) నైవేద్యంవంటలకోసం మట్టికుండలు తయారు చేస్తుంటాడు. నా దర్శనానికి రావాలని కోరికవున్నా, క్షణం తీరికే లేని ఆ భీముడు తన సారెపక్కనే శ్రీనివాసుని చిన్న చెక్కబొమ్మను పెట్టుకొని పని ముగించే సమయంలో భక్తితో తన వేళ్లకు అంటిన బంకమట్టితో నాలుగైదు పూలను చేసి సమర్పిస్తూ స్వామీ! నా భాగ్యం ఇంతే! అని ప్రార్థించేవాడు. ఏరోజు కారోజు అతని కోరిక కోరికగానే మిగిలిపోయింది. ఇదిగో ఆ భీముడు సమర్పించిన మట్టిపూలే ఇవి, అని పలికాడు స్వామి.

వెంటనే తొండమానుడు, స్వామి మెచ్చిన కుమ్మరభక్తుణ్ణి చూద్దామని అతను ఉండే పల్లెకు వెళ్లాడు. అప్పటికే భీముడు మట్టిమూకుట్లో పెట్టిన సంకటిని ప్రియంగా తింటున్న శ్రీస్వామివారు అక్కడ కన్పించాడు. దగ్గరికి వెళ్తుండగానే ఇంతలో శ్రీవైకుంఠంనుంచి బంగారు విమానం వచ్చింది. అందులో కుమ్మర భీముని దంపతులు ఎక్కగానే విమానం వైంకుంఠానికి వెళ్లిపోయింది. వేంకటేశ్వరస్వామి కూడా అదృశ్యమయ్యాడు.

ఈ దృశ్యాన్ని కళ్లారా చూచిన తొండమానుడు తిరుమలకొండకు చేరుకొని అహంకారం తగ్గించుకొని మరుజన్మలో వైకుంఠాన్ని పొందాడు. ఇది ఈ భక్తుల దివ్యగాథ !!

## తిరుమలనంబి

శ్రీ వేంకటేశ్వరస్వామి సేవలో జీవితాంతం తరించిన మరో భక్తుడు తిరుమలనంబి. వీరికే 'శ్రీశైలపూర్ణులు' అని మరో పేరు ఉంది. వీరు శ్రీనివాసుని అభిషేకానికి ప్రతిరోజు పాపవినాశనతీర్థజలాన్ని తెచ్చి ఇచ్చేవారు.

పరమభక్తుడైన తిరుమలనంబిని తాతా! తాతా! అంటూ పిలిచినాడట స్వామి. అందువల్లే వీరిని 'తిరుమల తాతాచార్యులు' అని కూడా అంటారు.

ఈయన ప్రతిరోజు తెల్లవారు జామున శ్రీవారి ఆలయంనుండి బయిలుదేరి పాపవినాశన తీర్థజలాలను తీసుకొని వచ్చి గోవిందా! గోవిందా!

అంటూ స్మరిస్తూ ఆలయంలో అభిషేకానికి జలాన్ని సమర్పించేవారు. ఆయిన ఒక రోజు అలా తీర్థాన్ని తెస్తుండగా, వేంకటేశ్వరుడు ఒక బోయ కుర్రవాడిగా మారి "తాతా! తాతా! నాకు చాల దప్పికగా వుంది. కాసిన్ని నీళ్లను ఇవ్వండి" అంటూ తిరుమలనంబి వెంటపడ్డాడు.

ఒరే ! ఈ పవిత్ర జలం స్వామివారి అభిషేక కైంకర్యం కోసం తీసుక వెళ్తున్నాను. నీకు ఇవ్వనుగాక ఇవ్వను. వేళ మించిపోతున్నది. తొందరగా గుడికి చేరుకోవాలి, దూరంగా జరుగు అంటూ వాణ్ణి అరచి, మళ్లీ 'గోవిందా' అంటూ వడి వడిగా నడక ప్రారంభించాడు.

ఆ బోయ కుర్రవాడు, తిరుమలనంబి వెంట వెనుకనే నక్కి నక్కి నడుస్తూ తన బాణంలో ఆయన తలపైపున్న నీటికుండకు రంధ్రం చేశాడు. అంతే 'ఆ నిండు కుండకు పడిన చిన్న రంధ్రం ద్వారా, ధారగా కారుతున్న నీటిని దోసిలిపట్టి తాగుతూ వెంటనడిచాడు.

కొంతసేపటికి కుండ ఖాళీ కావడం, భుజం తడిసి చల్లగా కావడంతో తిరుమలనంబి వెనక్కు తిరిగి చూశాడు. తన కుండకు రంధ్రం చేసి నీళ్లను తాగుతూ వెంటవస్తున్న బోయవాణ్ణి చూచి ఎంతపని చేశావురా! స్వామివారి కైంకర్యం కోసం తెచ్చే తీర్థాన్ని తాగావే! మళ్లీ తీసుకరావడానికి వేళ మించిపోయిందే. ఎలారా! అంటూ వాణ్ణి గట్టిగా తిట్టాడు.

తాతా! తాతా! అలా తిట్టకు, నీకు ఈ దగ్గర్లోనే మంచి తీర్థం చూపిస్తాను. రా, అంటూ తన బాణంతో ఆ కొండవాలుకు కొట్టాడు. అంతే! ఆ రంధ్రంలోంచి స్వచ్ఛమైన జలం ధారగా పెల్లు బికింది. తిరుమలనంబి ఆనందంతో ఆ జలాన్ని తీసుకొని ఆలయానికి వచ్చాడు.

ఆలయంలో వేంకటేశ్వరస్వామి, అర్చకుణ్ణి ఆవేశించి "తాతా! తిరుమలనంబీ! దారిలోనే నీవు ఇచ్చిన తీర్థంతో నాకు దాహం తీరింది. తాతా! నా అభిషేక కైంకర్యానికి దూరంగా ఉన్న పాప నాశనతీర్థం

నుంచిగాక, ఇప్పటినుంచి, దగ్గర్లో ఈ కొత్త తీర్థాన్ని తీసుకొనిరా, అదే ఆకాశగంగా తీర్థం అని పలికాడు.

అయ్యో! ఆ బోయవాని రూపంలో స్వామి వచ్చి జలం స్వీకరించి దప్పిక తీర్చుకున్నాడా! ఎన్ని తిట్లు తిట్టాను. క్షమించమంటూ భక్తిగా సాష్టాంగ నమస్కారం చేశాడు – తిరుమలనంబి.

ఆనాటినుంచి తిరుమలనంబి, 'తిరుమల తాతాచార్యులు'గా ప్రసిద్ధిని పొందాడు. ఇంతటి భక్తుడైన తిరుమలనంబి మరెవరోకాదు. భగవద్రామానుజులవారికి మేనమామ, అంతేకాదు అలిపిరిలో రామానుజులవారికి శ్రీరామాయణాన్ని గూర్చి ప్రతిరోజు పాఠం చెప్పిన గురువుగారు కూడ ఈ తిరుమల నంబి.

ఇలా శ్రీరామానుజులవారికి గురువుగా, శ్రీవేంకటేశ్వర స్వామివారికి "తాత"గా ప్రసిద్ధి పొందిన భక్తశిఖామణి తిరుమలనంబి! ఇదీ ఈ మహనీయుని దివ్యగాథ!

నేటికీ ఈ దివ్యగాథను స్మరిస్తూ ప్రతిసంవత్సరం ధనుర్మాసంలో 'తణ్ణీరముదు ఉత్సవం' జరుగుతుంది. అంటే 'అమృత జలోత్సవం' అన్నమాట, తిరుమలనంబిని స్మరింపజేసే ఈ రోజున తిరుమలనంబి వంశీయులు నేటికీ చందన తాంబూలాలతో సత్కరింపబడుతున్నారు. ఇదీ తిరుమలనంబి దివ్యగాథ!

## అనంతాళ్వారు

తిరుమలలో శ్రీనివాసునికి పుష్పకైంకర్యం చేసి తరించిన మరో భక్తుడు అనంతాళ్వారు. ఈయన భగవద్రామానుజుల వారికి ప్రియశిష్యుడు.

శ్రీరంగ క్షేత్రంలో ఒక రోజు రామానుజాచార్యులు పాఠం చెబుతూ, "తిరుమల శ్రీస్వామికి పూలంటే చాల ఇష్టం. అక్కడికి వెళ్లి పుష్పకైంకర్యం

ఎవరైనా చేస్తారా! అక్కడ ఆ కొండలో విపరీతంగా చలిబాధ, కీటకాల బాధకు వుంటుంది. వీటిని సహిస్తూ పుష్పకైంకర్యం చెయ్యాలి" అంటూ, అందుకు ఎవరైనా భక్తితో అంగీకరించగలరా? అని అడిగారు రామానుజాచార్యులవారు.

వెంటనే అనంతుడు అనే శిష్యుడు లేచి నిలబడి, నమస్కరిస్తూ, గురువుగారూ! మీరు అనుమతిస్తే, తిరుమలకు వెళ్లి వేంకటేశ్వరునికి నేను పుష్పకైంకర్యం చేస్తాను అంటూ ప్రార్థించాడు.

భళీ! అనంతా! నీవేనయ్యా అసలైన మగాడివి. అని మెచ్చుకొని పంపించాడు రామానుజులవారు. ఆనాటినుంచి 'అనంత పురుషుడు' అనే పేరు పొందిన ఆ శిష్యుడు తన భార్యతో తిరుమలక్షేత్రం చేరుకొన్నాడు.

స్వామివారి పుష్పకైంకర్యం కోసం, తిరుమలలో ఒక చెరువును తవ్వడం ప్రారంభించాడు. తాను మట్టిని తవ్వడం, తనభార్య మట్టిని దూరంగా పోయడం, ఇదీ వాళ్లిద్దరి పని. ఇలా కొంతకాలం సాగింది. భక్తిగా ఈ భార్యా భర్తలిద్దరూ చేస్తున్న చెరువు తవ్వే పనిలో శ్రీనివాసుడు సాయం చేద్దామనుకొన్నాడు. ఒక కుర్రవాడిగా మారిపోయి, వాళ్ల దగ్గరికి వెళ్లి తాను సాయం చేస్తానన్నాడు.

అనంతార్యులు కోపంగా ఒరే! వెధవా నిన్ను పిలిచానా? సాయం చేయమన్నానా? వెళ్లు వెళ్లు. వెళ్లక పోతే దెబ్బలు తింటావు. జాగ్రత్త. అంటూ హెచ్చరించగా ఆ కుర్రవాడు (స్వామి) వెళ్లిపోయాడు.

మళ్లీ కొన్నాళ్లకు ఆ యువకుడు (స్వామి) వాళ్ల దగ్గరికి వచ్చి చూశాడు. పాపం! అనంతుడు మట్టిని తవ్వుతుండగా ఆయన భార్య మెల్లగా ఆయాసంగా ఆ మట్టిని దూరంగా పోసి వస్తూవుండింది, ఆమె నిండు గర్భిణి. అందువల్లే ఆమె చాల ఆయాసపడుతోంది.

వెంటనే ఆ యువకుడు ఆమె దగ్గిరికి వెళ్లాడు. అమ్మా! నాకు మట్టిగంపను ఇవ్వు. నేను పోసి వస్తాను. నీవు బాగా అలసివున్నావు అంటూ మట్టిగంపను అందుకొని దూరంగా పోసి వస్తూ వుండినాడు.

కొంతసేపటికి మట్టిని తవ్వుతున్న అనంతాళ్వారు ఇది గమనించి, మట్టి తవ్వడం ఆపి వేసి, గడ్డపారతో కూడా గుంటపైకి వచ్చాడు. కోపంగా ఆ కుర్రవాణ్ణి చూస్తూ వెధవా! మళ్లీ పిలవని పేరంటానికి వచ్చావా! అంటూ గడ్డపారతో వాణ్ణి కొట్టడానికి వెంటపడ్డాడు. వాడు దొరికినట్లే దొరికి పారిపోగా కోపంతో చేతిలోని గునపాన్ని వానిపైకి విసిరాడు.

అంతే! ఆ గడ్డపార ఆ కుర్రవాడి గడ్డానికి తగిలింది. గాయమై రక్తం బొట బొట కారింది. అయినా అనంతుడికి ఆవేశం తగ్గలా. వెంటపడ్డాడు. ఆ కుర్రవాడు పరుగెత్తుతూ చివరకు ఆలయంలో దూరాడు. ఈ కుర్రాడు మళ్లీ అయినా దొరకడా! అనుకొంటూ అనంతుడు తిరిగి వెళ్లి, స్నానం చేసుకొని ఆ సాయంత్రం శ్రీస్వామివారి దర్శనం కోసం ఆలయంలో ప్రవేశించాడు.

అక్కడ ఆలయంలో ఏదో కలకలం! ఆందోళన, అర్చకులు బిగ్గరగా అరుస్తున్నారు. స్వామివారి గడ్డంనుంచి రక్తం కారుతోంది. ఎవరు కొట్టారో, ఎంత గట్టిగా కొట్టారో చూడండి. అంటూ ఆ గాయానికి పచ్చకర్పూరపు పొడిని పెడుతూ వుండినారు.

అప్పుడే లోనికి వచ్చిన అనంతయ్యకు ఆ సాయంత్రం తాను గాయం చేసిన కుర్రవాడు వేంకటేశ్వరస్వామివారి విగ్రహంలో కనపడ్డాడు. అయ్యో! స్వామివారినా నేను కొట్టింది? అని బాధపడుతూ, క్షమించుమని వేడుకొన్నాడు. ఈ కథను విన్న అర్చకస్వాములు, భక్తులు ఆశ్చర్యంతో ఆనందపడుతూ 'అనంతాళ్వార్' ఎంత భక్తుడో కదా? అని పొగిడారు.

ఆ తర్వాత అనంతాళ్వారు పూలతోటను చక్కగా పెంచుతూ, స్వామివారికి పుష్పకైంకర్యం చేస్తూ వుండినాడు.

ఆ పూలతోటను చూచిన వాళ్లందరూ మెచ్చుకొంటూ వుండినారు. ఆ తోట అందాల్ని చూద్దామని అలమేలుమంగ, శ్రీవేంకటేశ్వరస్వామివారు ఇద్దరూ ఒక రాత్రి వెళ్లారు. వెళ్లినవాళ్లు ఆ తోటలోని పూలన్నీ కోశారు. చెట్లన్నీ తుంచారు. ఇలా తోటంతా చిందర వందర చేశారు. మరునాడు పొద్దున చూచిన అనంతాళ్వారుకు ఆ దొంగలపై చాల కోపం వచ్చింది, ఆ దొంగల్ని పట్టుకోవడానికి కావలి కాశాడు. చివరికి ఒక రోజురాత్రి నక్కి నక్కి భార్యా భర్తల్ని ఇద్దర్ని పట్టుకొన్నాడు. కాని వాళ్లలో మగవాడు తప్పించుకొని పారి పోయాడు. ఆ దొంగవాని భార్య దొరికింది. ఇంతే చాలని అనంతాళ్వారు కోపంతో ఆమెను చెట్టుకు కట్టాడు. మరునాడు ఆలయం తెరువగా అర్చకులకు స్వామివారి వక్షఃస్థలంలోని లక్ష్మీదేవి కనపించక ఆందోళనపడ్డారు. ఇంతలో వారితో వేంకటేశ్వరస్వామి ఇలా అన్నాడు. అలమేలుమంగను అనంతాళ్వారు తనతోటలో కట్టివేశాడు. గౌరవంగా ఆమెను పిలుచుకొని రండి అని ఆజ్ఞాపించాడు. అంతే! అర్చకులు అందరూ వెళ్లి అనంతాళ్వారు కట్టివేసిన అలమేలుమంగతోకూడ ఆలయానికి బాజా భజంత్రీలతో పిలుచుకొని వచ్చారు. వెంటనే అమ్మవారు శ్రీస్వామివారి వక్షః స్థలాన్ని, చేరుకొంది. శ్రీస్వామివారు ఇలా అన్నాడు. మామా! అనంతాళ్వారూ! నీవు నాకు కన్య నిచ్చావయ్యా! అంటూ పొగిడాడు. నేటికీ పుష్పకైంకర్యంలో ఆయన వంశీయులు తరిస్తున్నారు. బ్రహ్మోత్సవాల అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామివారు ఈ మధురఘట్టాన్ని స్మరింపచేస్తూ, "అనంతాళ్వారుతోట"కు ఊరేగింపుగా వెళ్తున్నారు. ఇదే "బాగ్సవారి ఉత్సవం" అనీ "పురిశైతోట ఉత్సవం" అనీ అంటారు. ఇదీ ఈ పరమభక్తుని దివ్యగాథ!

## తాళ్లపాక అన్నమాచార్యులు

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి మరో పరమ భక్తుడు తాళ్లపాక అన్నమాచార్యులు. తిరుమలక్షేత్రంలో శ్రీస్వామివారిని గూర్చి గానం చేస్తూ,

ఉత్సవాలను నిర్వహిస్తూ జీవితాంతం తరించిన భక్త శిఖామణి అన్నమయ్యను గూర్చి సంగ్రహంగా తెలుసుకుందాం.

కడపజిల్లా రాజంపేట తాలుకాలో చిన్న గ్రామం తాళ్లపాక. ఆ ఊళ్లో లక్కమాంబ, నారాయణ సూరి దంపతులకు 1408 వైశాఖమాసం పున్నమినాడు అన్నమయ్య జన్మించాడు. ఈ దంపతులు సంతానంకోసం తిరుమలకు వచ్చి వేంకటేశ్వరస్వామిని ప్రార్థించారట. ఆ స్వామివారి నందకంఖడ్గం యొక్క అంశతో అన్నమయ్య జన్మించాడు.

చిన్నప్పటినుంచి అన్నమయ్యకు సంగీతమంటే చాలా ఇష్టం, అందువల్లే పాటలు పాడేవాడు. సంకీర్తనలు రాసేవాడు అందులోను శ్రీవేంకటేశుడంటే అన్నమయ్యకు అమిత భక్తి!

అన్నమయ్యకు ఎనిమిదేళ్లవయస్సులో ఒక సంఘటన జరిగింది, అల్లరిగా తిరుగుతున్న అన్నమయ్యను ఇంట్లో వాళ్లు గడ్డిని కోసుకరమ్మని పంపించారట! గడ్డిని కోస్తూ చేతివేలును కోసుకున్నాడు, అంతే అక్కడి నుంచి అటే తిరుమలకు చేరుకున్నాడు అన్మమయ్య. వేంకటేశ్వర స్వామిని దర్శించాడు. అక్కడ ఒక వైష్ణవస్వామి అన్నమయ్యకు వైష్ణవ మతాన్ని బోధించాడు. అప్పటినుంచి అన్నమయ్య 'అన్నమాచార్యులు' అయ్యాడు.

తర్వాత తాళ్లపాకకు వెళ్లిన అన్నమయ్యకు తిరుమలమ్మ, అక్కలమ్మ అనే ఇద్దరితో వివాహం అయింది. అన్నమయ్యకు నలుగురు పుత్రులు, ఒక కూతురు పుట్టారు. తర్వాత తిరుమల చేరిన అన్నమయ్య రోజుకు ఒక్క కీర్తనకు తక్కువ కాకుండా 32 వేల సంకీర్తనలను తిరుమల వేంకటేశ్వరునిపై ఆశువుగా రచించి గానం చేశాడు. అన్నమయ్య రాసిన ఈ పాటలను 'పదకవితలు' అంటారు. అందువల్లే అన్నమయ్య 'పదకవితాపితామహుడు' అని పేరు పొందాడు.

ఈ పదకవితల్లో వేంకటేశ్వరుణ్ణి గూర్చి అనేకవిధాలుగా వర్ణించాడు. స్వామివారి వీలల్ని, దశవతారాల్ని, రామాయణ భారత, భాగవత ఘంట్టాల్ని

వర్ణించాడు. అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని పాటల్నీ పాడుకొంటూ ఆంధ్ర దేశమంతా తిరిగాడు. ఎన్నో క్షేత్రాల్ని దర్శించాడు. అన్నమయ్య శ్రీవేంకటేశ్వర భక్తిని ప్రచారం చేశాడు. తిరుమల గోవిందరాజస్వామి, కడప వెంకటేశ్వరస్వామిని; ఒంటి మిట్ట రాముణ్ణి, పొద్దుటూరు చెన్నకేశవస్వామిని, అహోబల నరసింహుణ్ణి, మార్కాపురం చెన్న కేశవుణ్ణి, కోయిలకొంట్ల పాండురంగణ్ణి, శ్రీరంగంలోని రంగనాథుణ్ణి, వాయిల్‌పాడు పట్టాభిరాముణ్ణి, కసాపురం ఆంజనేయుణ్ణి ఇలా ఎందరో దేవతల్ని దర్శించి వాళ్లందరూ శ్రీవేంకటేశ్వరస్వామివారి రూపాలే, అని అందరికీ అభిన్నంగా వర్ణించాడు.

అంతేకాదు! శ్రీవేంకటేశ్వరస్వామివారికి నిత్యకల్యాణోత్సవం నిర్వహించాడు. మేలుకొలువు సేవల్లో, వసంతోత్సవాల్లో, పాల్గొని ఆ పాటల్ని గానం చేశాడు అన్నమయ్య తనపాటల్లో కేవలం భక్తిని మాత్రమే కాక, లోకకళ్యాణానికి పాటుపడ్డాడు అన్నమయ్య. తన పర్యటనలో తన కంట పడిన చెడును తుంచుకొంటూ, మంచిని పెంచుకొంటూ తిరిగిన సంఘోద్దారకుడు అన్నమయ్య.

శ్రీవేంకటేశ్వర భక్తి ప్రచారంలో, సంఘోద్ధరణలో జీవితాన్ని పండించుకున్న అన్నమాచార్యులు సుమారు 95 ఏండ్ల పాటు జీవించి 1503 పాల్గుణ ద్వాదశినాడు శ్రీ వేంకటేశ్వరునిలో ఐక్యం అయ్యాడు.

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతి ఏటా అన్నమాచార్యుల జయంతి – వర్ధంతి ఉత్సవాలను ఘనంగా జరపడమేగాక, అన్నమయ్య పాటల్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నది. సాక్షాత్తు హరి అవతారమైన అన్నమయ్యను స్మరించుకుంటూ ఆయన పాటల్ని చక్కగా గానం చేసి తరించుదాం.

## మహంతు హథీరాం బావాజీ

తిరుమల శ్రీస్వామివారి భక్తుల్లో ప్రముఖంగా స్మరింపదగినవారు మహంతు హథీరాం బావాజీ.

సుమారు ఐదువందల ఏండ్ల కిందట ఉత్తరభారతదేశం నుంచి యాత్రగా వచ్చి మహంతు బావాజీ తిరుమలలో శ్రీస్వామివారి భక్తుడిగా వుంటూ ఇక్కడే తపస్సు చేసుకొనేవాడు.

ప్రతి రోజు రాత్రి ఏకాంత సేవ అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామి బావాజీ కుటీరానికి వెళ్లి మాట్లాడుతుండేవాడట. రాత్రంతా ఆయనతో పాచికలాడేవాడు స్వామి! ఆ ఆటలో తాను బావాజీతో ఓడిపోతూ, ఆనందించేవాడట స్వామి!

పరమభక్తుడైన బావాజీ యాత్రికులకు సేవచేసేవాడు. వాళ్లకు అన్నదానం, వస్త్రదానం చేస్తూ, "మానవసేవే మాధవ సేవ' అన్నట్లుగా భక్తుల సేవను చేస్తుండేవాడు.

సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామివారు, మహంతు బావాజీతో మాట్లాడుతుంటాడనీ, పాచిక లాడుతుంటాడనీ ప్రచారం కలిగింది. ఇది విన్న చంద్రగిరి రాజు గిరిధర రాయలు మహంతును పరీక్షించాలనుకొన్నాడు. బండెడు చెరకును ఇచ్చి, తెల్లవారే లోగా తినాలని లేదా ఈ క్షేత్రం నుంచి వెళ్లగొడతానని ఆదేశించాడు ఆ రాజు. వేంకటేశ్వరుస్వామి ఏనుగురూపంలో వచ్చి ఆ చెరుకును తిన్నాడు. అందరూ ఏనుగుఘీంకారాల్ని విని ఆశ్చర్యపోయారు.

తెల్లవారి చూచిన వారు ఆశ్చర్యపోయి ఆయనను 'హథీరాంబావాజీ' అని పిలిచారు. హథీ అనగా ఏనుగు, ఈ సంఘటనతో గిరిధరరాయలు, ఆయన శిష్యులయ్యాడు. ఆ రోజునుంచి మహంతు బావాజీ, 'హథీరాం బావాజీ'గా 'బైరాగి చక్రవర్తి'గా పిలువబడినాడు.

ఇప్పటికీ తిరుమల క్షేత్రంలో మహంతుల మఠం ఉంది. ఆ మఠంలో శ్రీస్వామివారు పాచికలాట ఆడిన గద్దె (అరుగు) ఉంది. శ్రీస్వామివారికి ఆలయంలో ప్రతిరోజు తెల్లవారుజామున హథీరాంబావాజీ వారి 'నవనీతహారతి' జరుగుతుంది. ఇదే తొలిహారతి'.

ఆ తర్వాత హథీరాంబావాజీ శిష్యపరంపర ఏర్పడింది. ఆతర్వాత బ్రిటిషు పాలనలో హథీరాంబావాజీ శిష్యపరంపరలో శ్రీవారి ఆలయ వ్యవస్థలో 1843 నుంచి 1933 వరకు 90 ఏండ్ల పాటూ యాత్రికులసేవ చేస్తూ తరించారు.

మహంతుల పాలనలో తి.తి.దేవాలయాల అభివృద్ధి, జరిగింది. పాఠశాలలు, ఏర్పాటు యాత్రికులసేవే పరమార్థంగా అభివృద్ధి జరిగింది.

ఆకాశ గంగాతీర్థానికి దగ్గర్లో వున్న మహంతు బావాజీ సమాధిని నేటికీ భక్తులు దర్శించవచ్చు. ప్రతి సంవత్సరం ఆశ్వయుజ బహుళ త్రయోదశినాడు మహంతుబావాజీ వారి వర్ది' ఉత్సవం జరుగుతుంది. ఈ రోజు తి.తి.దేవస్థానంవారి మర్యాదలు జరుపబడుతాయి.

నేటకీ శ్రీవారి ఆలయంలో ప్రతిరోజు సుప్రభాతంలో తొలిగా 'నవనీతహారతి', తిరుమల రథోత్సవంలో హారతి, ఆణివర ఆస్థానాల్లో శ్రీవారికి హారతులంద జేస్తూ మహంతు హథీరాం బావాజీ తిరుమల క్షేత్రంలో స్మరింపబడుతునే వుండడం విశేషం!

## మాతృశ్రీ తరిగొండవెంగమాంబ

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిసేవలో తరించిన భక్త శిరోమణి మాతృశ్రీ తరిగొండవెంగమాంబ.

చిత్తూరుజిల్లాలోని వాయల్‌పాడు పట్టణానికి దగ్గర్లో "తరిగొండ" అనే గ్రామం ఉంది. క్రీ.శ.1730 ప్రాంతంలో, ఆ ఊళ్లో కానాల కృష్ణయ్య, మంగమ్మ అనే భార్యా భర్తలు వుండేవారు. వాళ్లకు కొడుకులు పుట్టినా, కూతురు కావాలన్న కోరికతో తిరుమలకొండకు యాత్ర చేశారు. శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంవల్ల వారి కోరిక తీరింది. పుట్టిన బిడ్డకు వేంకటేశ్వరస్వామి పేరే "వెంకమ్మ" అని పెట్టుకొన్నారు.

పుట్టినప్పటినుంచి వెంకమ్మ నిరంతరం భక్తితో, భజనల్లో మునిగి వుండేది. ఏ పనీ చేసేదికాదు. ఎప్పుడూ పరధ్యానమే. అలా పనీ పాటా లేకుండా, ఇంటి పని చెయ్యకుండా వున్న ఆడపిల్లను ఎవరు పెళ్లి చేసుకొంటారు. పాపం తల్లిదండ్రులు ఎట్లో కష్టపడి పెళ్లి చెయ్యాలని చాల ప్రయత్నాలు చేశారు. నాకు పెళ్లే వద్దు, వేంకటేశ్వరుడే నా భర్త అని అన్నప్పటికీ బలవంతంగా చిత్తూరు దగ్గర్లోని 'నారగుంటపాళెం' గ్రామంలోని "వెంకటాచలపతి"కి ఇచ్చి పెళ్లి చేశారు తల్లిదండ్రులు. కాని వెంకమ్మ కాపురానికి వెళ్లకముందే భర్త వెంకటాచలపతి స్వర్గస్థుడు కాగా, ఆమె పుట్టినింటిలోనే వుండింది.

ఇంతలో మదనపల్లిలో వున్న "రూపావతారం సుబ్రహ్మణ్యశాస్త్రి" అనే గురువు ఆమెకు వేదాంతం బోధించి, మంత్రోపదేశం చేశాడు. అందువల్ల వెంకమ్మ భక్తి మరింత పెరిగింది. భక్తురాలైన వెంకమ్మ, భర్త మరణించినా, పూలు, పసుపుకుంకుమలు, ధరించడం, చేతికి గాజులు ధరించడం, మెట్టెలు ఉంచుకోవడం చూసి గ్రామస్థులు ఆమెను నానా హింసలు పెట్టారు, చివరకు ఆమె తరిగొండను విడిచి తిరుమల క్షేత్రానికి చేరుకొని వేంకటేశ్వర స్వామివారి సేవలో నిరంతరం మునిగి వుండేది. శ్రీస్వామివారికి పూలు సమర్పిస్తుండేది. కర్పూర హారతి ఇస్తుండేది. తిరుమలలో ఆమెకు తాళ్లపాక అన్నమయ్య వంశీయులు ఇల్లు ఇచ్చి ఆశ్రయమిచ్చారు. నిరంతరం శ్రీస్వామివారి దర్శనం, ధ్యానంలో వుండే ఆమెకు భక్తులు, భక్తిగా, గౌరవంగా చూడటం ఆలయ అర్చకులకు, మరికొందరికి వెంకమ్మపై నిష్కారణంగా ద్వేషం ఏర్పడింది. ఆమెను గుడికి రాకుండా, ఒక వేళ వున్నా అర్చకులు ఆమెను గుళ్లో ఎక్కువసేపు ఉండకుండా తరిమి వేసేవారు. పాపం వెంగమాంబ, తన ఇంటిలోనే ధ్యానం చేసుకొనేది. ధ్యానంలో వున్న ఆమెపై పక్క ఇంటిలోవున్న అర్చకులు ఆమెపైన ఎంగిలి ఆకులు వేసి, ధ్యాన భంగం చేసేవారు. ఆమె సహించలేక శపించింది. ఆమె శాపంతో అర్చకుల

ఇంటిలోని వారందరు వెంటనే మరణించగా మిగిలినవారు శరణువేడగా, ఆమె క్షమించి, శాపాన్ని తొలగించింది.

అత్యంత భక్తవత్సలుడైన శ్రీనివాసుడు రాత్రి ఆమె ఇంటికి వచ్చి సంభాషించేవాడట. వెంగమాంబ శ్రీస్వామివారిపై ఎన్నో సంకీర్తనలు రచించి పాడుతుండేది. ఎన్నెన్నో కావ్యాలు రచించింది. ఆమె చెప్తుంటే శ్రీ స్వామివారు వింటూ నర్తన చేసేవారట. అలా ఆమె, శ్రీకృష్ణమంజరి, శ్రీవేంకటాచలమాహాత్మ్యం, యోగవాసిష్ఠం, జలక్రీడావిలాసం, రమాపరిణయం, ఇలా ఎన్నెన్నో కావ్యాల్ని, యక్షగానాల్ని, శతకాలను రచించి శ్రీస్వామివారికి అంకితమిచ్చింది.

భక్తురాలైన మాతృశ్రీవెంగమాంబ తన రచనలు అన్నిట్లోను తరిగొండగ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామికి, శ్రీతిరుమలవెంకటేశ్వర స్వామికి అభేదం చెప్పేది. ఇద్దరూ ఒక్కరే అంటూ భక్తిగా వర్ణించి చేప్పేది.

ఒకసారి ఏకాంతసేవ తర్వాత ఆమె ఇంటికి వచ్చిన వెంకటేశ్వరస్వామి ఆమె చెప్తున్న శ్రీకృష్ణలీలల్ని వింటుండగా తెల్లవారింది. సుప్రభాత సమయానికి స్వామివారు అదృశ్యమై గుడి చేరుకోగా స్వామివారి వస్త్రం వెంగమ్మ చేతిలో సగం మిగిలి పోయింది. బంగారు వాకిళ్లు తెరచిన అర్చకులు స్వామివారి వస్త్రం సగం చిరిగి పోయివుండడం చూసి, భక్తురాలైన వెంగమ్మను అడుగగా, ఆమె ఆ వస్త్రాన్ని ఇవ్వగా అర్చకులు, అందరూ ఆశ్చర్యపోయారు. పరమ భక్తురాలు అని మాతృశ్రీతరిగొండ వెంగమాంబ' అంటూ ఆమెను స్తుతించారు.

ఒక బ్రహ్మోత్సవ సమయంలో ఆమె ఇంటిముందు శ్రీవారి రథం ఆగిపోగా, అర్చకుల కోరికమేరకు ఆమె ఆరతి ఇచ్చింది. ఒకప్పుడు ఒక విప్రుని రోగాన్ని పోగొట్టింది. ఆమె ఆశీస్సే శ్రీవెంకటేశ్వరస్వామివారి అనుగ్రహంగా భావించేవారు. ఇలా ఎన్నెన్నో మహిమలు చూపుతున్న

మాతృశ్రీవెంగమాంబ సుమారు 200 ఏండ్లకిందట 1917 శ్రావణమాసంలో శుద్ధనవమినాడు సమాధి చెందించి. ఆమె బృందావనం తిరుమలలో శ్రీవరాహస్వామి ఆలయానికి ఉత్తరం దిక్కున రెండు వందలగజాల దూరంలో వుంది.

తి.తి.దేవస్థానం వారు వైశాఖమాసంలో శ్రీనృసింహజయంతినాడు ఆ భక్తురాలి జయంతిని, శ్రావణమాసంలో 'వర్ధంతిని' ఘనంగా జరుపుతున్నారు.

ప్రతిరోజు రాత్రి ఏకాంత సేవలో శ్రీవారి ఆలయంలో తాళ్లపాకవారు జోలపాట పాడుతుండగా, తరిగొండ వెంగమాంబగారి కర్పూరహారతి ఆనాటి నుంచి "ముత్యాలహారతి" అనే పేరుతో జరుగుతుంది. అందువల్లే "తాళ్లపాక వారి లాలి, తరిగొండవారి హారతి" అని ప్రసిద్ధి ఏర్పడింది.

ఇప్పటికీ తిరుమల శ్రీవారి ఆలయంలో "ముత్యాలహారతి"తోనే ఆలయం వాకిళ్లు మూస్తారు.

## 7. తిరుమలేశుని ఉత్సవాలు

ఏడుకొండలస్వామికి ఏడాది పొడవునా ప్రతిరోజు ఏదో ఒక ఉత్సవం జరుగుతునే ఉంటుంది. ఏదో ఒక ఊరేగింపు నిర్వహింప బడుతునే ఉంటుంది. అందువల్లే తిరుమలలో ప్రతిరోజూ పండుగే! ప్రతిపూటా పరమాణ్ణాలే! పిండివంటలే!

భక్తజనుల సంబరాల మధ్య సంవత్సరం పొడవునా సాగే ఉత్సవాలను 1. నిత్యోత్సవాలు, 2. వారోత్సవాలు, 3. మాసోత్సవాలు, 4. వార్షికోత్సవాలు (సంవత్సరోత్సవాలు) అని నాలుగువిధాలుగా వింగడించి వాటిని గూర్చి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

### నిత్యోత్సవాలు

ప్రతి రోజు ఉదయం నుంచి వరుసగా రాత్రి వరకు జరిగే సేవలే నిత్యోత్సవాలు.

### సుప్రభాతం

ప్రతి రోజు తెల్లవారు జామున జరిగే మేలుకొలుపు సేవ సుప్రభాతం. "కౌసల్యా సుప్రజా రామా......." అని సుప్రభాత శ్లోకాలను అర్చకులు పఠిస్తుండగా బంగారువాకిళ్లను తెరచి శ్రీవేంకటేశ్వరస్వామిని మేల్కొల్పుతారు.

### తోమాలసేవ

సుప్రభాత సేవ అయిన తర్వాత శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలమూర్తికి, ఉత్సవమూర్తులకు జరిగే పుష్పాలంకరణను 'తోమాలసేవ' అంటారు. సువాసనతో కూడిన రంగు రంగుల పుష్పాలను, తులసిమాలలను అలంకరిస్తారు.

### కొలువు

ప్రతి రోజు బంగారు సింహాసనంలో జరిగే "కొలువు"లో స్వామివారికి ఆ రోజుటి పంచాంగ శ్రవణంతో పాటు ముందు రోజు ఆలయానికి వచ్చిన ఆదాయ వ్యయాలు వినిపిస్తారు.

### సహస్రనామార్చన

పిదప శ్రీనివాస భగవానునికి తులసి దళాలతో సహస్ర నామార్చన జరుగుతుంది. తర్వాత నైవేద్యం చేస్తారు.

### నిత్యకల్యాణోత్సవం

శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి వారలకు మధ్యాహ్నం 12గంటలకు నిత్య కల్యాణోత్సవం నిర్వహింపబడుతుంది. ప్రతిరోజూ జరిగే కల్యాణోత్సవం వల్లనే తిరుమల క్షేత్రానికి "నిత్యకల్యాణం పచ్చతోరణం" అని ప్రసిద్ధి ఏర్పడింది.

### డోలోత్సవం

శ్రీవారి ఆలయంలో వున్న అద్దాలమండపంలో మధ్యాహ్నం 2గం॥కు శ్రీస్వామివారికి డోలోత్సవం జరుగుతుంది. నిర్ణీత రుసుమును చెల్లించిన భక్తుల కోరిక మీదనే ఈ సేవను నిర్వహిస్తారు.

**ఆర్జిత బ్రహ్మోత్సవం**

**వసంతోత్సవం** ఆలయం వెలుపవున్న వైభవమండపంలో నిర్ణీతరుసుమును చెల్లించిన భక్తుల ప్రార్థనమేరకు మధ్యాహ్నం 3గం॥కు శ్రీస్వామివారికి బ్రహ్మోత్సవం, వసంతోత్సవం వంటి సేవలు నిర్వహిస్తారు.

**సహస్రదీపాలంకరణసేవ**

ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు ఆలయం బయట వున్న కొలువు మండపంలో స్వామివారలకు సహస్ర **దీపాలంకరణ** సేవ జరుగుతుంది. ఈ సేవ అనంతరం పుర వీధుల్లో ఊరేగింపు చేస్తారు.

**ఏకాంత సేవ**

తిరుమల ఆలయంలో ప్రతి రోజు రాత్రి చివరగా జరిగే **'పవళింపుసేవ'**ను సేవను **"ఏకాంత సేవ"** అంటారు. ఈ సేవ జరిగిన తర్వాత శ్రీవారి ఆలయం మూసివేస్తారు.

ఇవీ ప్రతిరోజు జరిగే నిత్యోత్సవాలు

## వారోత్సవాలు

**శ్రీస్వామివారికి వారానికి ఒక్క సారి మాత్రమే జరిగే ఉత్సవాలు ఇవి**

**విశేష పూజ :** ప్రతి సోమవారం ఉదయం 6 గం॥కు శ్రీదేవి భూదేవులతో శ్రీమలయప్పస్వామికి విశేషపూజ జరుగుతుంది.

**అష్టదళపాద పద్మారాధన :** ప్రతి మంగళవారం ఉదయ 6గం॥కు శ్రీస్వామివారి మూలమూర్తికి బంగారు పద్మాలతో జరిగే అర్చన సేవ ఇది.

**సహస్ర కలశాభిషేకం :** ప్రతి బుధవారం – బంగారు వాకిలిముందు భోగ శ్రీనివాసమూర్తికి, శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామికి, సేనాధిపతి విష్వక్సేనులవారికి – జరిగే సేవ సహస్రకలశాభిషేకం.

**తిరుప్పావడ సేవ :** ప్రతి గురువారం ఉదయం 6 గంటలకు శ్రీస్వామివారిమూర్తికి జరిగే నైవేద్య సేవ ఇది. బంగారువాకిలి బయట శ్రీస్వామివారి ఎదురుగా పులిహోర రాశిని నివేదనంగా సమర్పిస్తారు. అదే తిరుప్పావడ సేవ.

**పూలంగి సేవ :** ప్రతి గురువారం రాత్రి 8గం॥కు శ్రీస్వామివారిమూల మూర్తికి నిలవెల్ల పుష్పాలంకరణ జరుగుతుంది. ఇదే పూలంగి సేవ.

**శుక్రవారాభిషేకం :** శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలమూర్తికి ప్రతి శుక్రవారం తెల్లవారు జామున 5గం॥కు ఆవుపాలు, ఆకాశగంగా తీర్థం, పునుగు, జవ్వాది, పరిమళం మున్నగు ద్రవ్యాలతో అభిషేకం జరుగుతుంది.

**నిజపాదదర్శనం :** ప్రతి శుక్రవారం అభిషేకానంతరం శ్రీస్వామివారి మూలమూర్తి నిజపాదాల దర్శనం చేసుకొనే సేవ ఇది.

ఇవీ వారానికి ఒక్క సారి తిరుమలలో జరిగే వారోత్సవాలు.

## మాసోత్సవాలు

తిరుమల శ్రీవారికి నెలకు ఒక్క మారు మాత్రమే జరిగే ఉత్సవాలు ఇవి. ప్రతి నెలా ఆ యా నక్షత్ర దినాల్లో వస్తాయి కనుక వీటిని **నక్షత్రోత్సవాలు** అని కూడా అంటారు.

### రోహిణి నక్షత్రోత్సవం

శ్రీకృష్ణుడి అవతార నక్షత్రం రోహిణి. ప్రతినెలా రోహిణి నాటి సాయంత్రం శ్రీవారి ఆలయంలో వున్న రుక్మిణీ శ్రీకృష్ణుని ఉత్సవమూర్తులకు, సహస్రదీపాలంకరణసేవ, ఊరేగింపు నిర్వహింపబడుతుంది.

### ఆర్ద్ర నక్షత్రోత్సవం

భగవద్రామానుజులవారి జన్మ నక్షత్రం ఆరుద్ర. ప్రతినెలా ఆరుద్ర నక్షత్రం నాటి సాయంత్రం సహస్ర దీపాలంకరణసేవ తర్వాత

శ్రీస్వామివారికి అభిముఖంగా శ్రీరామానుజులవారి ఉత్సవమూర్తి ఊరేగింపబడుతుంది.

### పునర్వసు నక్షత్రోత్సవం

శ్రీరాముని అవతార నక్షత్రం పునర్వసు. ప్రతినెలా పునర్వసు నక్షత్రం నాటి సాయంత్రం, శ్రీవారి ఆలయంలోని శ్రీసీతారామ లక్ష్మణులతోపాటు, ఆంజనేయస్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ తర్వాత ఊరేగింపును నిర్వహిస్తారు.

### శ్రవణ నక్షత్రోత్సవం

శ్రీవేంకటేశ్వరస్వామివారు అవతరించిన నక్షత్రమే శ్రవణం. ప్రతినెలా శ్రవణ నక్షత్రం నాటి సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామివారికి సహస్ర దీపాలంకరణసేవ అనంతరం ఊరేగింపు చేస్తారు.

కాని కన్యామాసం (సెప్టెంబరు – అక్టోబరు)లో వచ్చే శ్రవణ నక్షత్రం నాటికి ముందు పదిరోజుల నుండే శ్రీవారికి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

### పున్నమి గరుడసేవ

ప్రతి నెలా పున్నమి నాటి రాత్రి 7గంటలకు శ్రీస్వామివారికి ఒక్కరికే బంగారు గరుడోత్సవం జరుగుతుంది.

ఇవీ ప్రతి నెలా తిరుమలలో జరిగే మాసోత్సవాలు.

## సంవత్సరోత్సవాలు

సప్తగిరీశునికి సంవత్సరంలో ఒకమారు మాత్రమే కొన్ని విశేష దినాల్లో కొన్ని ఉత్సవాలు జరుగుతాయి. వాటినే 'వార్షికోత్సవాలు' అనీ 'సంవత్సరోత్సవాలు' అనీ అంటారు. వాటిల్లో కొన్ని ముఖ్యమైన ఉత్సవాలను గూర్చి తెలుసుకుందాం.

### ఉగాది ఆస్థానం – ఇతర ఆస్థాన సేవలు

ప్రతి ఏటా ఉగాది పండుగనాడు తెలుగు వారి ఇలువేలుపు అయిన తిరుమలేశుడికి "ఉగాది ఆస్థానం" బంగారు వాకిలిముందు జరుగుతుంది. శ్రీదేవి భూదేవులతో శ్రీమలయప్పస్వామికి ఘనంగా నివేదనలు, నూతన వస్త్రసమర్పణ, నూతన పంచాంగ శ్రవణం జరుగుతుంది.

బంగారువాకిలి ముందు జరిగే ఈ ఆస్థానం వేడుకను అర్చకులు ఆలయ అధికారులు, ఆలయ సిబ్బంది మాత్రమే దర్శించడానికి వీలవుతుంది. ఇంచుమించు ఇదే రీతిలో, **ఆణివార ఆస్థానం** (జూలై16వ) **దీపావళి ఆస్థానం, శ్రీరామనవమి ఆస్థానం, శ్రీకృష్ణాష్టమీ ఆస్థానం** లాంటివన్నీ ఆలయంలో బంగారువాకిలి ముందు జరుగుతాయి) అందరూ దర్శించ వీలుకాదు.

### వార్షిక వసంతోత్సవం

ప్రతి ఏటా చైత్రమాసంలో పున్నమినాటికి పూర్తి అయ్యేట్లుగా మూడురోజుల పాటు వసంతోత్సవాలు నిర్వహింపబడతవి,

శ్రీవారి ఆలయానికి నైరృతి మూలలో వున్న వసంతమండపంలో మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవంలో మొదటి, రెండు రోజులు శ్రీదేవి భూదేవులతో శ్రీమలయప్పస్వామికీ, మూడవ రోజున శ్రీమలయప్పస్వామితో పాటు శ్రీ సీతారామలక్ష్మణులకు, శ్రీరుక్మిణి శ్రీకృష్ణులకు వసంతోత్సవాలు నిర్వహిస్తారు, రెండవరోజు ఉదయం శ్రీమలయప్పస్వామివారికి స్వర్ణ రథోత్సవం నిర్వహిస్తారు.

### పద్మావతీ పరిణయోత్సవం

వైశాఖ శుద్ధ దశమినాడు, శ్రీవేంకటేశ్వరస్వామికి, ఆకాశరాజు పుత్రిక పద్మావతికి వివాహం జరిగినరోజు. ఆ రోజును పురస్కరించుకొని

1992నుండి వైశాఖమాసంలో నవమి, దశమి, ఏకాదశి ఇలా మూడు రోజుల పాటు సాయంత్రం తిరుమల నారాయణగిరి తోటలో శ్రీపద్మావతీ పరిణయోత్సవాలు వేడుకగా జరుగుతవి. వీటిని భక్తులందరూ దర్శించవచ్చు.

### జ్యేష్ఠాభిషేకం

ప్రతి ఏటా జ్యేష్ఠమాసంలో జ్యేష్ఠానక్షత్రం నాటికి పూర్తి అయ్యేట్లుగా మూడురోజులపాటు ఆలయంలోపల శ్రీవారి ఉత్సవమూర్తులకు 'జ్యేష్ఠాభిషేకం' నిర్వహిస్తారు. దీన్నే 'అభిధేయక అభిషేకం' అంటారు.

అత్యంత ప్రాచీనమైన శ్రీవారి ఉత్సవమూర్తులు, అభిషేకాలతో భిన్నం కాకుండా పరి రక్షించే నిమిత్తం చేసే ఉత్సవం ఇది. ప్రతి సంవత్సరం కేవలం ఈ మూడు రోజుల్లో మాత్రమే పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసువు, చందనం వంటి అభిషేక ద్రవ్యాలతో తిరుమంజనం జరుగుతుంది. మొదటి రోజు వజ్రకవచంతోను, రెండవరోజు ముత్యాల కవచంతోను, మూడవరోజు బంగారుకవచంతోను శ్రీమలయప్పస్వామివారు పురవీథుల్లో దర్శనమిస్తారు, చివరిరోజు శ్రీవారికి సమర్పించిన బంగారుకవచం, మళ్లీ ఏడాదికి జరిగే 'జ్యేష్ఠాభిషేకం'లో మాత్రమే తీసి వేయబడుతుంది.

### నాగపంచమి – గరుడోత్సవం

ప్రతి సంవత్సరం శ్రావణమాసం శుద్ధపంచమిరోజున అనగా గరుడపంచమి రోజున సాయంత్రం తిరుమల స్వామివారికి "గరుడోత్సవం" జరుపబడుతుంది.

### పవిత్రోత్సవాలు

కొన్ని సందర్భాల్లో అంటూ, మైల ఉన్న వ్యక్తులు ఆలయాల్లో ప్రవేశించ కూడదు. అయితే వాళ్లకు తెలియకుండానే కొందరు వ్యక్తులు ఆలయంలో

ప్రవేశించవచ్చు. అప్పుడు ఆలయ పవిత్రతకు కొంత భంగం కలుగవచ్చు. ఇలాంటి తెలిసీ, తెలియని దోషాలు భక్తులవల్ల మాత్రమేకాక, ఆలయంలో పని చేసే సిబ్బందివల్ల కలుగవచ్చు, అందువల్ల తెలిసీ, తెలియక జరిగే ఇలాంటి దోషాల నివారణకు మూడురోజులు జరిపే ఉత్సవమే 'పవిత్రోత్సవం'.

ప్రతి సంవత్సరం శ్రావణమాసం (ఆగష్టు)లో శుద్ధ దశమి, ఏకాదశి, ద్వాదశి రోజుల్లో హోమాలు, పవిత్రప్రతిష్ఠ' పవిత్ర సమర్పణ వంటి వైదిక కార్యక్రమాలతో ఈ ఉత్సవం జరుపబడుతుంది. మూడు రోజులు సాయంత్రం శ్రీమలయప్పస్వామికి ఊరేగింపు జరుగుతుంది.

## బ్రహ్మోత్సవాలు

కలియుగంలోని భక్తుల రక్షణకోసం బ్రహ్మాది దేవతల కోరిక మేరకు, శ్రీమహావిష్ణువు తిరుమలకొండపైన వేంకటేశ్వరుడిగా కన్యామాసంలో శ్రవణ నక్షత్రం నాడు స్వయంవ్యక్తమూర్తిగా ఆవిర్భవించినాడు.

ఆ రోజును పురస్కరించుకొని బ్రహ్మదేవుడు ఆ రోజుకు పూర్తి అయ్యేట్లుగా తొమ్మిది రోజులు ముందు నుంచి శ్రీనివాస భగవానునికి ఉత్సవాలు నిర్వహించాడు. ఆనాటినుంచి ప్రతి ఏటా నిర్విఘ్నంగా జరుగుతున్న ఈ ఉత్సవాలు "బ్రహ్మోత్సవాలు' అని ప్రసిద్ధిని పొందాయి.

చాంద్రమానంప్రకారం అధికమాసం వచ్చిన సందర్భంలో "వార్షిక బ్రహ్మోత్సవం" కన్యామాసంలోను, "నవరాత్రి బ్రహ్మోత్సవం" తులామాసంలోను ఇలా రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

## అంబరాన్నంటే బ్రహ్మోత్సవ సంబరాలు

ఏడాదికి ఒకమారు పదినాళ్లపాటు సాగే బ్రహ్మోత్సవాలు 'న భూతో న భవిష్యతి!' గా ఉంటూ, ఏ ఏడాదికి ఆ ఏడాది కొత్తగా జరుగుతూ ఆనందాన్ని కలిగిస్తాయి.

వేంకటేశ్వరుడు కన్యామాసంలో శ్రవణనక్షత్రం రోజున ఆవిర్భవించిన రోజును పురస్కరించుకొని బ్రహ్మోత్సవాలు ఏనాటినుంచో జరుగుతున్నాయి. బ్రహ్మదేవుడు నిర్వహించినందువల్లే ఇవి బ్రహ్మోత్సవాలుగా ప్రసిద్ధిని పొందాయి. శ్రవణనక్షత్రం రోజుకు పదినాళ్ల ముందుగా **ధ్వజారోహణతో** ప్రారంభమై, చివరగా, **చక్రస్నానం, ధ్వజావరోహణంతో** ముగిసే ఈ పదినాళ్ల వేడుకల సంరంభాన్ని, సంబరాల్ని వర్ణించడం సాధ్యం కాదు చూచి తీర వలసిందే.

మొదటిరోజు రాత్రి **పెద్దశేషవాహనంతో** ప్రారంభమైన ప్రతిరోజు ఉదయం రాత్రి వరుసగా **చిన్న శేషవాహనం, హంసవాహనం, సింహం, ముత్యపుపందిరి, కల్పవృక్షం, సర్వభూపాల వాహనం, మోహినీ అవతారం, గరుడోత్సవం, హనుమద్వాహనం, గజవాహనం, సూర్య ప్రభ, చంద్ర ప్రభ, రథోత్సవం, అశ్వవాహనం.** ఇలా జరిగే వాహనోత్సవాల్లో శ్రీనివాసుని వైభవం అనంతం! అప్రమేయం! అచింత్యం!!

ఈ బ్రహ్మోత్సవంలో ముఖ్యంగా ఐదవనాటి రాత్రి జరిగే బంగారు గరుడోత్సవం, ఎనిమిదవరోజు ఉదయం జరిగే రథోత్సవాలను దర్శించడానికి రెండు కన్నులు చాలవు.

శ్రీవారి గరుడోత్సవం రోజున మూలవిరాట్టునకు అలంకరించే **మకరకంఠి, లక్ష్మీహారాలు, సహస్రనామ మాలలు,** మద్రాసునుంచి కొత్త గొడుగులు, **శ్రీవిల్లిపుత్తూరు గోదాదేవి మాలలు**. ఇలా అనేక విశేషమైన వాటితో తిరుమల వీధులలో బంగారు గరుడునిపై విహరించే వేంకటేశుణ్ణి, ఆ ఒక్కరోజు దర్శించడానికి లక్షలాది భక్తులు తిరుమల చేరుకుంటారు.

బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాల్లో **బ్రహ్మచారులు, గృహస్థులు, వానప్రస్థులు, యతీశ్వరులు, బాలబాలికలు, కన్యలు, పుణ్యాంగనలు,**

**వితంతువులు, విధురులు, కుంటి, గుడ్డి, వికలాంగులు, అధికారులు, అనధికారులు, పండితులు, పామరులు, ధనికులు, పేదవారు, ఉద్యోగులు, ఉద్యోగార్థులు, కార్యార్థులు, శరణార్థులూ, అర్థార్థులూ**. ఇలా వారూ వీరూ అనకుండా ఎందరెందరో, మరెందరో కలియుగవైకుంఠుని దర్శించడానికి వస్తారు.

ముఖ్యంగా ఏడాదికి ఒకమారు పదినాళ్లపాటు జరిగే బ్రహ్మోత్సవ సంబరాలు అంబరాన్నంటుతాయి.

ఏడుకొండల్లో ఒకవైపు గోవిందలు పెడుతూ కొండలు ఎక్కుతున్న భక్తజనం. మరోవైపు భక్తితో భజన చేస్తున్న భజనబృందాలు ఇంకోవైపు **కోలాటనృత్యాలు, చెక్క భజనలు, హరికథలు, బుర్రకథలు, పగటివేషాలు, పుష్కరిణీస్నానాలు, దర్శనాలు, నున్నటిగుండ్లతో** తిరునామాలతో సాక్షాత్తు నామాలవాని **ప్రతిరూపాలు**గా కన్పడే భక్తులు, **నిత్యాన్నదానాలు, ప్రసాద వితరణలు...** యాత్రికుల సేవలో అహరహం శ్రమిస్తున్న దేవస్థానం ఉద్యోగస్థులు, **శ్రీవారిసేవక బృందాలు, స్కౌట్లు, ......., ఆరోగ్యాధికారులు, అర్చక స్వాములూ, ధార్మిక ప్రసంగాలు..** ఇలా ఒక్కరేమిటి ఒక్కటేమిటి ఎందరెందరో ఎన్నోవిధాల ఆనందంగా కోలాహలంగా సంబరంగా కనపడతాడు.

ఇక బ్రహ్మోత్సవం జరిగే రాత్రుళ్లలో తిరుమలక్షేత్ర సౌందర్యం వర్ణనాతీతం! తిరుమల అంతటా **స్వాగతతోరణాలు, ఆలయ ప్రాకారాలు, మండపాలు, పుష్కరిణి, సత్రాలు..** ఇలా సర్వేసర్వత్రా తిరుమలలో మిరుమిట్లు గొలుపుతున్న విద్యుద్దీపాలలో శోభాయమానంగా అలంకరింపబడుతుంది. బ్రహ్మాది దేవతలు, ఇతరలోక దేవతలు జ్యోతిః స్వరూపాలుగా దిగివచ్చి బ్రహ్మాండనాయకుని ఉత్సవాన్ని వీక్షిస్తున్నారా అన్నట్లుగా ఉంటుంది తిరుమలక్షేత్రం. ఈ సందర్భంలో ప్రత్యేకత పుష్పాలంకరణ. శ్రీవారిఆలయం అంతటా వింత వింత పుష్పాలతో,

సుగంధాలను వెదజల్లే పూలతో శ్రీవారి ఆలయం, సర్వత్రా అలంకరించడం దేవస్థానంవారి, పుష్పవనాలశాఖ ప్రత్యేకత! అవన్నీ కన్నులారా చూస్తూ మనసారా ఆస్వాదించవలసిందే తప్ప చెప్పడానికి మాటలు చాలవు. లేవు కూడ.

### పుష్పయాగం

ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల అనంతరం కార్తికమాసంలో శ్రవణ నక్షత్రం రోజున శ్రీదేవి భూదేవీ సమేతంగా శ్రీమలయప్పస్వామికి 'పుష్పయాగం' జరుగుతుంది. క్రీ.శ.15వ శతాబ్దం నాటికి జరుగుతున్న పుష్పయాగం ఎప్పుడు నిలిచిపోయిందో తెలియదు. మళ్లీ 1980 నవంబరు 14 తేది నుంచి పునరుద్ధరింపబడి తిరుమల శ్రీవారికి నిర్వహింపబడుతున్నది.

శ్రీవారి బ్రహ్మోత్సవ నిర్వహణలో దోషాల నివారణార్థం అతివృష్టి, అనావృష్టులు తొలగి లోక క్షేమంకోసం జరిగే పుష్పయాగంలో ఉదయంపూట తిరుమంజనం, మధ్యాహ్నం రంగురంగుల వివిధ పుష్పాలతో 21 మారులు శ్రీ స్వామివారిని అర్చిస్తారు.

### నాగుల చవితి

పెదశేషవాహనం ప్రతిసంవత్సరం కార్తీకమాసం శుద్ధచవితి అనగా - ''నాగులచవితి'' రోజున సాయంత్రం తిరుమల శ్రీస్వామివారికి "పెదశేషవాహనం" జరుపబడుతుంది.

### పారువేట ఉత్సవం

ప్రతి సంవత్సరం కనుమ పండుగ నాడు శ్రీస్వామివారికి పారువేట ఉత్సవం జరుగుతుంది. శ్రీమలయప్పస్వామివారు శంఖం, చక్రం, గద, ఖడ్గం, ధనస్సు ఈ పంచాయుధాలను ధరించి వేటకు బయలు దేరి పారువేట మండపం చేరుకుంటారు. ఆ స్వామి వెంట వేరొక పల్లకిలో శ్రీకృష్ణస్వామి వెళ్తారు.

అక్కడ శ్రీ స్వామివారు తాళ్లపాకంవారి, సన్నిధిగొల్లల వారి సేవలందుకొని, వారిని అనుగ్రహిస్తారు.

సాయంత్రంవరకు పారువేట వేడుకల్లో పాల్గొన్న తర్వాత శ్రీస్వామివారు, కృష్ణస్వామివారు ఊరేగింపుగా ఆలయం చేరుకొంటారు.

అధికమాసం వచ్చిన సంవత్సరంలో శ్రీస్వామివారికి రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. మొదటిదాన్ని "వార్షిక బ్రహ్మోత్సవం" అనీ, రెండవమారు జరిగేదాన్ని "నవరాత్రి బ్రహ్మోత్సవం" అంటారు. ఇలా రెండు బ్రహ్మోత్సవాలు జరిగిన సందర్భంలో రెండవ బ్రహ్మోత్సవం పూర్తి అయిన మరునాడు తిరుమలేశునికి **"పారువేట ఉత్సవం"** జరుపబడుతుంది.

## రథసప్తమి

ప్రతి సంవత్సరం మాఘ మాసంలో శుద్ధ సప్తమి "సూర్యజయంతి"నాడు "రథసప్తమి" పేరుతో తిరుమలలో ఉత్సవం జరుగుతుంది.

ఆ రోజు శ్రీవేంకటేశ్వరస్వామివారు సూర్యోదయం మొదలు రాత్రి చంద్రోదయంవరకు ఏడువాహనల్లో విహరిస్తాడు. సూర్యప్రభ, చిన్న శేషవాహనం గరుడవాహనం, హనుమద్వాహనం కల్పవృక్షవాహనం, సర్వభూపాలవాహనం చంద్ర ప్రభవాహనం ఇలా ఏడువాహనల్లో శ్రీమలయప్పస్వామివారు దర్శనమిస్తారు. మధ్యాహ్నం శ్రీస్వామిపుష్కరిణిలో చక్రస్నానం జరుగుతుంది. రథసప్తమి నాటి వేడుకలను 'అర్ధ బ్రహ్మోత్సవం' అనీ, ఒక రోజు బ్రహ్మోత్సవం, అని అంటారు.

## తెప్పోత్సవాలు

ప్రతి ఏటా ఫాల్గుణ పూర్ణిమకు పూర్తి అయ్యేట్లుగా ఐదురోజుల పాటు తెప్పోత్సవాలు శ్రీ స్వామిపుష్కరిణిలో జరుగుతాయి. 15వ శతాబ్దంలో జరిగిన తెప్పోత్సవాలు ఏకారణంచేతో ఆగిపోగా దేవస్థానం 1921 నాటి నుంచి పునరుద్ధరించి, నిర్వహిస్తున్నది.

ఐదు రోజుల ఈ తెప్పోత్సవాల్లో మొదటిరోజు శ్రీసీతారామ లక్ష్మణులు, రెండవరోజు రుక్మిణీ శ్రీకృష్ణులు, చివరి మూడు రోజులు శ్రీదేవీ భూదేవీ సమేతంగా శ్రీమలయప్పస్వామివారు పాల్గొంటారు.

పైన పేర్కొన్నవే గాక, ధనుర్మాసంలో – తిరుప్పావై, వైకుంఠ ఏకాదశి ప్రణయకలహోత్సవం, అధ్యయనోత్సవాలు, నరసింహజయంతి, శ్రీవరాహజయంతి, శ్రీఅనంతపద్మనాభచతుర్దశి, చక్రతీర్థముక్కోటి, కైశికద్వాదశి, కార్తిక దీపోత్సవం, క్షేత్రపాలక ఉత్సవం, శ్రీవారిబాగ్ సవారి ఉత్సవం, పురిశైతోటఉత్సవం, తణ్ణీరముదుఉత్సవం వంటి వార్షిక ఉత్సవాలు తిరుమల క్షేత్రంలో నిర్వహింపబడుతునే ఉన్నాయి.

ఇలాగ ఏడుకొండల వాడికి ఏడాది పొడవునా ఎన్నో సేవలు, మరెన్నెన్నో ఉత్సవాలు చిన్నవీ, పెద్దవీ, అందరూ చూడ వీలున్నవీ, చూడ వీలు లేనివీ అనేకం జరుగుతూ ఉన్నాయి.

ఆనందనిలయుడు ఉత్సవ ప్రియుడట! అంతకంటె భక్త ప్రియుడట! ఆ స్వామివారికి ఉన్న భక్త ప్రియత్వం అంతా ఇంతా కాదు. తనను చేరవచ్చిన భక్తులచేత ఉత్సవాలు చేయించుకుంటాడు. దర్శింప జేసుకుంటాడు. మొక్కులు చెల్లింప చేసుకుంటాడు. ఒక వేళ ఉత్సవాలు చేయించలేకపోయినా పర్వాలేదట! ఆ కొండలరాయని కొండంత ఉత్సవ వైభవాన్ని కన్నులారా దర్శిస్తే చాలు. పాపాలు పోతాయి. కోరికలు తీరుతాయి. జీవితం ప్రశాంతత పొందుతుంది. అంతు లేని ఆనందం కలుగుతుంది. అందుకే అన్నమాచార్యులు శ్రీస్వామివారిని ఇలా ప్రార్థిస్తాడు.

**ఘనుని చేయను నీ కైంకర్యమే చాలు!**
**మొనసి రక్షించను నీ మంత్రమే చాలు!!**

**ఓం నమో వేంకటేశాయ**

## 8. తిరుమలలో వసతి సౌకర్యం

తిరుమలకు వచ్చే యాత్రికులు తిరుమలలో ఉన్న ఆమెనిటీస్ కాంప్లెక్సు భవనాల్లో **"లాకర్ల"**ను ఉచితంగా తీసుకొని హాళ్లలో బస చేయవచ్చు లేదా రాంబగీచా, శ్రీవరాహస్వామి నారాయణగిరి, నందకం, పాంచజన్యం వంటి అనేక అతిథి గృహాల్లో లేదా, శంకుమిట్ట కాటేజీలు, ఆంనదాళ్వార్‌టాంకు కాటేజీలు, గరుడాద్రినగర్, సప్తగిరి సత్రాల్లో ముందుగానే తగిన రుసుమును చెల్లించి ప్రైవాటిని రిజర్వు చేసుకోవచ్చు.

## 9. శ్రీవారి దర్శన విధానం

తిరుమలయాత్రికులు, భక్తులు వారి వీలును అనుసరించి శ్రీవేంకటేశ్వరస్వామివారిని నాలుగు విధాలుగా దర్శించుకోవచ్చు. **"శ్రీవారిమెట్టు"** లేదా **"అలిపిరి"** మెట్లద్వారా కొండకు నడచివెళ్లే యాత్రికులు **"దివ్యదర్శనం"** పేరుతో రోజుకు సుమారు 20వేలమందికి శ్రీస్వామివారిని ఉచితంగా దర్శించే సౌకర్యం ఉంది. లేదా రూ.300/–లు ఒక్కరికి ఆన్‌లైను ద్వారా **"శీఘ్రదర్శనం"** పేరుతో టిక్కెట్టును పొంది దర్శించవచ్చు. లేదా **"సర్వదర్శనం"** పేరుతో ఏరోజైనా ఉచితంగా దర్శించవచ్చు. ఇవిగాక ఆర్జితసేవల్లో పాల్గొనే భక్తులకు దర్శన సౌకర్యం ఉంటుంది.

## 10. తిరుమలలో చూడవలసిన అద్భుత ప్రదేశాలు

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వింత వింత పేర్లు ఉన్న దేవుడు? అందులో ఒకటి **"అద్భుత మహిమలదేవుడు"**. ఈ ఒక్క పేరే కాదు. ఇంకా **"మొక్కుబళ్ళదేవుడు; ఉత్సవాలదేవుడు; ఆపదమొక్కులదేవుడు; అడుగడుగుదండాలదేవుడు; కోరినవరాల దేవుడు; పిలిస్తే పలికే దేవుడు;"** ఇలాంటి ఎన్నో పేర్లతో పిలువబడుతున్న శ్రీవేంకటేశ్వరుడు భూలోక వైకుంఠం వేంకటాచలక్షేత్రంలో 'ఆనందనిలయం' అనే

బంగారుమేడ మధ్యభాగంలో నిలిచి, భక్తులకోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తూ ఉండే దేవాది దేవుడు. ఆ స్వామి ఊరికే నిలిచి ఉండడం కాదు. తన కోసం, తన దర్శనం కోసం ఆర్తిగా, ఆర్ద్రంగా అశ్రులు చాస్తూ వచ్చిన భక్తులను **రండర్రా! త్వర త్వరగా రండర్రా! మీ కోసమే నేను నిలిచి ఉన్నానర్రా!** అంటూ కుడిచేత్తో తన పాదాలను చూపుతూ ఏ మాత్రం తరగని చెరగని చిరుమందహాసంతో దర్శనం ఇస్తూ కొండలంతటి వరాలను గుప్పిస్తున్న దేవుడు శ్రీవేంకటేశ్వరుడు!

**"కలియుగంలో అందర్నీ ఆదుకొని అన్నికోరికలు తీర్చగలిగిన ఏకైక దేవుణ్ణి నేనే"** అంటూ **"కలౌవేంకటనాయకః"** అనే విశిష్టమైన ప్రశస్తితో తన అవతారలక్ష్యాన్ని చాటుతూ ఉన్న స్వామి శ్రీవేంకటేశ్వరుడు. కనుకనే ఆ స్వామి **"మానవసేవ చేస్తున్న మాధవుడు"**గా ప్రసిద్ధిని పొందినాడు.

తిరుమలేశుని అవతారలక్ష్యసంకల్పానుసారం తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యం కూడ, అత్యున్నత అధికారి మొదలు అతి చిన్నఉద్యోగి వరకు భక్తులను, "అతిథులు"గా "అభ్యాగతులు"గా భావిస్తూ అహరహం అప్రమత్తంగా సేవలందిస్తున్నారు. శ్రీవారి దర్శనం, విశ్రాంతి గదులు, భవనాలు, కల్యాణకట్ట, స్వామిపుష్కరిణి, అన్నదానభవనం... ఇలా చాలాచోట్ల భక్తులు శ్రమపడకుండా, సేవలందిస్తున్నది దేవస్థానం.

అయినా విపరీతంగా, దేవస్థానంవారి అంచనాలకు మించి లక్షలమంది భక్తులు వస్తున్నందువల్ల "శ్రీవారి దర్శనం" మాత్రం ఆలస్యం అవుతున్నది. దాని కారణంగా క్యూల్లో గంటలతరబడి నిలబడి, విసుగు చెందకుండా అలసిపోకుండా ఉండే విధంగా భక్తులకు దర్శన వేళలను వారి వారికి కేటాయించి కొంత వెసులుబాటు కలిగింపబడుతున్నది. ఆ వెసులుబాటు వల్ల రద్దీపెరిగిన వేళల్లో సుమారు 5 నుంచి 10 గంటల వరకు వ్యవధిని పొందిన యాత్రికులు, తిరుమలలో తప్పక చూడదగిన

దివ్యప్రదేశాలను గూర్చి తెలుపుతున్నాం. తిరుమలక్షేత్రంలో విహరిస్తూ వాటిపై పూర్తిగా అవగాహనతోపాటు ఆనందించండి.

## శ్రీవారి కల్యాణకట్ట

భక్తులకు జీవితంలో ఉన్న ఎన్నో సమస్యలను, మరెన్నో చిక్కులను తలచిక్కులను స్వీకరిస్తూ అన్ని చిక్కుసమస్యలను పోగొడుతూ, భక్తులచేతికి చిక్కుతున్న పరంధాముడు ఘనవేంకటేశుడు. మనిషి చేసిన పాపాలు, దోషాలు తలలో చేరతాయట! అహంకారం కలిగించే అందమైన శిరోజాలను స్వామివారికి సమర్పించుకుంటే ఆ పాపాలన్నీ పోతాయి.

భక్తులు తమదర్శన సమయంలో కలిగిన ఐదారు గంటల వెసులుబాటు వేళలో పాత అన్నదానభవనం ఎదురుగా ఉన్న **'కల్యాణకట్ట'** భవనంలో మొక్కులు సమర్పించుకోవచ్చు. ఒక వేళమొక్కుల సమర్పణ లేకపోయినా ఈ భవనాన్ని సందర్శించి ఇక్కడ జరుగుతున్న తలనీలాల సమర్పణ యజ్ఞాన్ని చూచి ఒక అవగాహన కలిగించుకోవచ్చు.

పురుషులు స్త్రీలు, పిల్లలు పెద్దలు, ముత్తైదువులు, కన్యలు... ఇలా అందరూ తరతమ భేదం లేకుండా ఒక పవిత్రయజ్ఞంగా భావిస్తూ తమ తలనీలాలను మొక్కులుగా సమర్పించే ఐదంతస్థుల ఎత్తు ఉన్న విశాలమైన రెండు భవనాల సముదాయమే "శ్రీవారికల్యాణకట్ట". ఇక్కడేగాక రాంబగీచ అతిథి గృహాలవెనుక ఉన్న "నందకం" అతిథిగృహంలో తమ నీలాల సమర్పణ సౌకర్యం ఉంది.

భక్తితో తమ నీలాలను సమర్పించిన మొగుడి బోడిగుండును పెండ్లాం, పెండ్లాం తలగుండును మగడు, తల్లిదండ్రుల బోడిగుండులను పిల్లలు, పిల్లల బోడిగుండ్లను తల్లిదండ్రులు చేతులతో తడిమి తడిమి పగలబడినవ్వుతూ "గోవిందా! గోవిందా! ఏడుకొండలవాడా గోవిందా!"

అంటూ అవ్యక్తమైన ఆనందాల్లో మునిగివున్న వీళ్లందరి మధ్యలో కేరింతలతో ఉబ్బి తబ్బిబ్బు అవుతాడంట ఆనందనిలయుడు. అబ్బో!

## శ్రీ స్వామిపుష్కరిణి

శ్రీవరాహస్వామి ఆలయానికి ఎదురుగా, శ్రీనివాసుని ఆలయానికి ఉత్తరంగా విశాలమైన కోనేరు ఉంది. దీన్ని **"శ్రీస్వామిపుష్కరిణి"** అంటారు. ఏడుకొండలలోని సర్వతీర్థజలాలతోపాటు ముల్లోకాల్లోని పుష్కరిణిలకు ఇది స్వామివంటిది. ప్రభువు వంటిది. ప్రధానంగా ఎనిమిది దిక్కుల్లో ప్రసిద్ధతీర్థాలు వేంచేసిన "శ్రీస్వామిపుష్కరిణి"ని దర్శించినా, ఆ పవిత్ర జలాలను స్పృశించినా, ఆ నీళ్ళలో స్నానం చేసినా ఎన్నో జన్మల పాపాలు పోతాయట! కష్టాలుపోతాయి. మరెందుకు ఆలస్యం, గోవిందా! గోవిందా అంటూ కోనేటిలో మునకలు వేయండి.

శ్రీస్వామివారి దర్శనానికి ముందుగా "శ్రీస్వామిపుష్కరిణి'లో స్నానం చేసి, తొలుత శ్రీఆదివరాహస్వామిని దర్శించిన తర్వాతే శ్రీనివాసుణ్ణి దర్శించాలి. అది క్షేత్ర సంప్రదాయం.

## శ్రీ ఆదివరాహస్వామి ఆలయం

తిరుమలక్షేత్రంలో శ్రీస్వామి పుష్కరిణికి పడమటి ఒడ్డున శ్రీ ఆదివరాహస్వామి ఆలయం ఉంది. తిరుమలక్షేత్రంలో తొలిదైవంగా కొలువైవున్న శ్రీవరాహస్వామివారి వల్లనే **'ఆదివరాహక్షేత్రం'** అనీ, **'శ్వేతవరాహక్షేత్రం'** అనీ ప్రసిద్ధి కలిగింది. తొలిగా 'అర్చన, నివేదన, దర్శనం' నియమాలతో ఆదివరాహస్వామి, శ్రీనివాసునికి ఈ క్షేత్రంపైన 100 అడుగుల స్థలదానం చేసినందువల్ల, శ్రీస్వామిపుష్కరిణిలో స్నానంచేసి, మొదట శ్రీఆదివరాహస్వామివారిని దర్శించిన తర్వాతే, శ్రీనివాసుణ్ణి దర్శించాలి. ఇలా చేస్తేనే శ్రీనివాసునికి ఇష్టమేగాక, తిరుమలయాత్ర పూర్తిగా ఫలప్రదమవుతుందని పురాణోక్తి!

## మాతృశ్రీ తరిగొండవెంగమాంబ బృందావనం

శ్రీవరాహస్వామివారి ఆలయానికి ఉత్తర దిక్కులో సుమారు రెండువందల మీటర్ల దూరంలో మాతృశ్రీతరిగొండ వెంగమాంబ అనే పరమభక్తురాలి మహాసమాధి" ఉంది. ఇక్కడే వెంగమాంబ "శ్రీవేంకటాచల మాహాత్మ్యం" "ద్విపద భాగవతం" వంటి అనేక గ్రంథాలను రచించి శ్రీవేంకటేశ్వరస్వామికి అంకితం చేసింది. 1730లో వైశాఖశుద్ధచతుర్దశి నృసింహజయంతినాడు పుట్టిన శ్రీవెంగమాంబ గారు 1817 శ్రావణమాసంలో బహుళనవమినాడు సజీవంగా సమాధిలో ప్రవేశించింది. ఈ భక్తురాలు, ప్రతిరోజురాత్రి యోగమార్గంలో శ్రీవారి ఆలయానికి వెళుతుందని ప్రతీతి! నేటికీ ప్రతిరోజు రాత్రి చివరగా మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సమర్పించిన "ముత్యాలహారతి" అనే కర్పూర హారతి సమర్పణతో శ్రీవారి ఆలయం బంగారు వాకిళ్ళు మూసివేస్తారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబగారి సమాధి బృందావనాన్ని దర్శించి, భక్తులు తమ తిరుమల యాత్రను సంపూర్ణంగా ఫలప్రదం చేసుకోవాలని ఆకాంక్ష!

## తిరుమలనంబి గుడి

శ్రీవారి ఆలయానికి మహా ప్రదక్షిణమార్గంలో దక్షిణ దిక్కున మొదట్లోనే **"తిరుమలనంబి సన్నిధి (గుడి)"** ఉంది. సాక్షాత్తు తిరుమలేశుని చేతనే **తాతా! తాతా!** అని పిలిపించుకొన్న పరమభక్తుడే తిరుమలనంబి, ప్రతి నిత్యం తిరుమల శ్రీస్వామివారి అభిషేక కైంకర్యానికిగాను ఆకాశగంగాతీర్థజలాలను తెచ్చే సేవలో తరించిన పరమభక్తుడు. నేటికీ ఆయన వంశీయులు తీర్థకైంకర్య సమర్పణంలో తరిస్తున్నారు.

భగవద్రామానుజులవారికి మేనమామే కాక, గురువూ, శ్రీనివాసునికి తాత అయిన శ్రీతిరుమలనంబి గుడిని దర్శించండి. ఆ భక్తునికి, ఆ

భగవంతునికి ప్రత్యక్షంగా చోటు చేసుకొన్న అనేక సంఘటనలను తెలుసుకొని మధురానుభూతులను పొందండి.

## అనందాళ్వార్ తోట

శ్రీవేంకటేశ్వరస్వామివారికి పుష్పకైంకర్యంలో తరించిన పరమ భక్తుడు అనంతాళ్వారులు. ఈయన భగవద్రామానుజులకు అత్యంత సన్నిహితమైన శిష్యభక్తుడు. గురువుగారి ఆదేశంపై జీవితాంతం శ్రీనివాసునికి పుష్పకైంకర్యంలో తరించి తిరుమలక్షేత్రం లోనే సమాధిచెందిన అనందాళ్వార్ ఎంతటి దైవభక్తి పరుడో, అంతకంటె ఎక్కువ గురుభక్తి ఉన్నవాడు.

ఆలయ మహాప్రదక్షిణమార్గంలో సరిగ్గా శ్రీవారి ఆలయానికి నైరృతి దిక్కున అనంతాళ్వార్ పెంచిన పూలతోట, ఆ తోటమధ్యలో అనంతాళ్వార్ సమాధిని భక్తులు దర్శించవచ్చు. ప్రతి సంవత్సరం రెండుమార్లు సాక్షాత్తు మలయప్పస్వామివారు. ఈ తోటకు వేంచేసి ఆ భక్తుణ్ణి నేటికీ అనుగ్రహించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. భక్తుడు అనంతళ్వారుకు భగవంతుడు శ్రీనివాసునికి మధ్య ఎన్నెన్నో అద్భుతసన్నివేశాలు జరిగిన ఈ అనంతాళ్వార్ తోటను దర్శించి తరించండి.

## శ్రీ వేంకటేశ్వర మ్యూజియం

తిరుమల శ్రీవారిఆలయానికి పశ్చిమ దిక్కున, వైకుంఠం 2వ క్యూకాంప్లెక్సు భవనానికి దగ్గర్లో **"శ్రీవేంకటేశ్వర మ్యూజియం"** భవనం ఉంది.

తిరుమలలో భక్తులు తప్పక దర్శించి తీరవలసిన దివ్యప్రదేశం ఇది. ఈ భవనంలో 8వ శతాబ్దం మొదలు నేటివరకు తర తరాలుగా

తిరుమలక్షేత్ర వైభవాన్ని తెలియజేసే తిరుమల భౌగోళిక శిలలు, శిల్పాలు, ఎప్పటికప్పుడు కాలాంతరంలో మార్పులు పొందిన శ్రీస్వామివారి వాహనాలు, దంతపుపల్లకిలతోపాటు, తాళ్ళపాకవారి రాగిరేకులు, ఆలయ సంప్రదాయ కళలు, ఆళ్వారుల వివరాలు చారిత్రక శాసనవివరాలు సంగీత సాధనాలు.... ఇలా ఒక్కటేమిటి ఎన్నెన్నో అద్భుతమైన ఆశర్యకరమైన వివిధ వస్తుజాలాన్ని, వాటి చరిత్రలను ఆకళింపుచేసుకొని పరమానందాన్ని మనసార జుర్రుకొనచ్చు. ఇంక ఆలస్యం ఎందుకు! కేవలం నామమాత్రపు ప్రవేశ రుసుం ఉన్న ఈ మ్యూజియాన్ని మీరు దర్శించండి! ఇతర భక్తులను దర్శింప చేయండి.

### నారాయణగిరి పాదాలు

తిరుమలగిరుల్లో ఏడుకొండలు ఉన్నాయి. అందులో శ్రీవారి ఆలయానికి వెనుక భాగంలో చాల ఎత్తైన పర్వత శిఖరం ఉంది. అదే నారాయణాద్రి. శ్రీవైకుంఠం నుంచి వచ్చిన శ్రీనివాసుడు తొలుత ఈ పర్వత శిఖరంపై కాలుమోపినాడు. అందువల్లే దాన్ని నారాయణాద్రి అంటారు. ఈ పర్వతంపై శ్రీనారాయణుని శిలాపాదాలు ప్రతిష్ఠింపబడినాయి. ఈ శిఖరంపైనుంచి, తిరుమల గిరులన్నీ అత్యంతమనోహరంగా కనపడతాయి. చూచి తీరవలసిన దివ్యస్థలం ఇది.

* * *

## 11. తిరుమలలో దర్శించవలసిన దివ్యతీర్థాలు

తిరుమల శ్రీవారి ఆలయానికి చుట్టుపక్కల సమీప దూరంలో ఏ రోజైనా భక్తులు వెళ్ళ గలిగిన, తప్పక దర్శించవలసిన తీర్థాలు, దివ్యస్థలాలు కూడ తిరుమలగిరుల్లో చోటుచేసుకున్నాయి.

తిరుమల క్షేత్రం ఎన్నో పుణ్యతీర్థాలకు నిలయం. అనాదిగా ఎందరో మహనీయులు తిరుమలేశుని గూర్చి తపస్సు చేస్తూ శ్రీస్వామివారిని

ప్రత్యక్షం చేసుకొన్న దివ్యస్థలాలే ఈ తీర్థాలు. సర్వపాపహరాలైన ఈ తీర్థ విశేషాలను సంగ్రహంగా తెలుసుకుందాం. ఆయా తీర్థాలను సందర్శించి పాపాల్ని పోగొట్టుకొని పుణ్యాలను సంపాదించుకొందాం.

## గోగర్భ తీర్థం (పాండవతీర్థం)

తిరుమల శ్రీవారి ఆలయానికి ఉత్తరం దిక్కున కేవలం 3 కిలోమీటర్ల దూరంలో గోగర్భం తీర్థం ఉంది. గోవుగర్భంలాగా ఉన్న ఇక్కడి గుహలో ఎందరో ఋషులు తపస్సులు చేశారు. పాండవులు అరణ్య వాససమయంలో కొంతకాలం ఇక్కడ ఉండి శ్రీనివాసుణ్ణి సేవించారు. అందువల్లే దీన్ని “పాండవతీర్థం” అంటారు. ఇక్కడి గుహలో పాండవుల శిల్పాలు ఉన్నాయి. ఈ తీర్థం పక్కనే తిరుమల క్షేత్రపాలకులైన రుద్రుడు, పెద్దగుండు రూపంలో ఉన్నాడు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి నాడు నమకచమక మంత్రాలతో ఈ రుద్రునికి అభిషేకం జరుగుతుంది.

## శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం - శ్రీహథీరాంబావాజీ సమాధి

ఆకాశగంగాతీర్థానికి వెళ్ళే ప్రధాన రహదారిలోనే, దగ్గరగా శ్రీవేణుగోపాలస్వామివారి మందిరం, ఆ పక్కనే శ్రీహథీరాంబావాజీవారి సమాధి ఉంది. మహంతుబావాజీ శ్రీ వేంకటేశ్వరస్వామితో పాచికలాడిన పరమభక్తుడు. తిరుమల శ్రీ హథీరాం బావాజీ మఠం ఆధ్వర్యంలో ఉన్న వీటిని కూడ భక్తులు దర్శించవచ్చు.

## అకాశ గంగ తీర్థం

ఇది శ్రీస్వామిపుష్కరిణికి ఉత్తరాన రెండుమైళ్ల దూరంలో వుంది.

పూర్వం అంజనాదేవి ఇచ్చట తపస్సుచేసి ఆంజనేయుని పుత్రునిగా పొందినందువల్ల ఇది అంజనాద్రిగా పిలువబడింది. ఆకాశగంగాతీర్థంలో

పూర్వం రామానుజుడనే విప్రుడు తపస్సు చేసి శ్రీవేంకటేశ్వరుని ప్రత్యక్షం చేసికొన్నాడు.

మేషమాసంలో చిత్తానక్షత్రంతో కూడినపున్నమినాడు ఈ తీర్థంలో స్నానం చేస్తే ముక్తి కలుగుతుంది.

పూర్వం ఒక విప్రుడు తనకు వచ్చిన గాడిద ముఖాన్ని ఈ తీర్థంలో స్నానం చేసి పోగొట్టుకున్నాడు.

ఈ తీర్తంలో తి.తి.దేవస్థానం పురోహితుల ద్వారా యాత్రీకులు తీర్థ క్రియలు నిర్వహించుకోవచ్చును.

ఈ తీర్థానికి బస్సుసౌకర్యం వుంది.

వైష్ణవస్వాములు ప్రతిరోజు శ్రీవారి అభిషేకానికి గాను రెండు బిందెల తీర్థ జలాన్ని తీసుకెళ్తారు.

**జాబాలి తీర్థం**

తిరుమల శ్రీస్వామి పుష్కరిణికి ఉత్తరాన రెండు మైళ్ల దూరంలో అత్యంత ప్రకృతి రామణీయకమైన లోయలో ఈ తీర్థం వుంది.

జాబాలిమాహర్షి కొంతకాలం తపస్సు చేసినందువల్ల ఆయన పేరుతో ఈ తీర్థం ప్రసిద్ధమైంది.

పూర్వం దురాచారుడనే విప్రుడు ఈ తీర్థంలో స్నానం చేసి బ్రహ్మరక్కసి నుండి విముక్తి పొందాడు. కొంతకాలం అగస్త్య మహర్షి ఇక్కడ తపస్సుచేసి శ్రీనివాసుణ్ణి ప్రత్యక్షం చేసికొన్నాడు.

ఈ తీర్థంలో ఆంజనేయస్వామి వారి ప్రాచీనమైన ఆలయం వుంది. ఈ ఆలయం మహంతు మఠంవారి అధీనంలో వుంది.

జాబాలితీర్థానికి అత్యంతసమీపంలో సీతమ్మతీర్థం, ధ్రువతీర్థం ఉన్నాయి.

ఈ తీర్థానికి, తిరుమల నుంచి పాపవినాశనం వేళ్లే దారిలో బస్సు దిగి ఒకమైలు నడిచి వెళ్లవచ్చు.

## పాపవినాశనం

తిరుమల శ్రీవారి ఆలయానికి ఉత్తరం దిక్కున 3 మైళ్ల దూరంలో నెలకొన్న తీర్థం పాపవినాశనం.

ఈ తీర్థస్నానంవల్ల పానంవల్ల ఘోర పాపాలు పోతాయట. ధ్రుడమతి అనేవాడు అనేక పాపాలుచేసి గ్రద్దగా మారి, ఇందులో స్నానం చేయగా ముక్తి కలిగిందట. ఒక విప్రుడు బ్రహ్మరాక్షసుని నుండి విముక్తి పొందాడు. భద్రమతి అనే వ్యక్తి ఈ తీర్థాన్ని సేవించి సంపన్నుడయ్యాడు.

ఈ తీర్థంలో ఆశ్వయుజ శుద్ధసప్తమి ఉత్తరాషాఢా నక్షత్రంలో కూడిన ఆదివారంనాడు లేదా ఉత్తరాభాద్ర నక్షత్రంలో కూడిన ద్వాదశినాడు కాని స్నానం చేయటం ఉత్తమం.

తిరుమల నుంచి ఈ తీర్థానికి బస్సు సౌకర్యంవుంది.

## వైకుంఠ తీర్థం

శ్రీస్వామిపుష్కరిణికి ఈశాన్యమూలలో రెండు మైళ్ల దూరంలో ఒక గుహ ఉంది. ఈ గుహకు "వైకుంఠ గుహ" అనీ, అందులోంచి ఎప్పుడూ బయటికి వచ్చే తీర్థానికి "వైకుంఠ తీర్థం" అనీ అంటారు.

శ్రీరాముడు వానరసైన్యంతో కూడి ఇక్కడికి వచ్చిన సందర్భంలో వానరులకు ఈ గుహలో ఒక పెద్ద నగరం, అందులో శ్రీమహావిష్ణువు దర్శనమిచ్చారు. వానరులు వెలుపలికి వచ్చేసరికే గుహ మూసుకొని వుండిందట. ఈ విషయాన్ని విన్న శ్రీరాముడు ఇది భూలోక వైకుంఠం. ఇందులో శ్రీమహావిష్ణువు సంచరిస్తుంటాడు. ఆయన దర్శనమే మీకు కలిగిందన్నాడట.

ఈ తీర్థానికి సరియయిన దారి లేదు.

## చక్రతీర్థం - శిలాతోరణం

తిరుమల శ్రీవారి ఆలయానికి వాయవ్య దిక్కున 2 మైళ్ల దూరంలో చక్రతీర్థం వుంది.

250 కోట్ల సంవత్సరాలనాటిదిగా ఇటీవల కనుగొనబడిన "శిలాతోరణం" పక్కనే వంద అడుగుల దూరంలో ఈ చక్రతీర్థం వుంది.

ఈ తీర్థంలో తపస్సు చేస్తున్న పద్మనాభుడనే భక్తుని రక్షించవలసిందని శ్రీనివాసుడు సుదర్శనభగవానుని ఆదేశించాడు. అప్పటి నుంచి చక్రతీర్థంగా పిలువబడుతున్నది.

శ్రీరంగం నుండి సుందరుడనే విప్రుడు తనకు కలిగిన రాక్షసత్వాన్ని ఈ తీర్థానికి వచ్చి పోగొట్టుకున్నాడు.

ప్రతి సంవత్సరం కార్తీక బహుళ ద్వాదశినాడు ఈ చక్రతీర్థముక్కోటి జరుగుతుంది. ఆనాడు శ్రీవారి ఆలయం నుంచి అర్చకులు ప్రసాదాలతో వచ్చి ఇక్కడ వెలసిన సుదర్శనునికి, శ్రీనరసింహస్వామికి అభిషేకార్చనలు, నివేదనలు చేస్తారు.

''శిలాతోరణం'' పక్కనే భక్తులు చక్రతీర్థాన్ని కూడా సందర్శించవచ్చు.

## శ్రీరామకృష్ణ తీర్థం

శ్రీస్వామివారిఆలయానికి ఉత్తరం దిక్కున సుమారు 6 మైళ్ల దూరంలో రామకృష్ణ తీర్థం వుంది.

పూర్వం కృష్ణుడనే ముని, ఆ తర్వాత రామకృష్ణుడనే ముని తపస్సుచేసి స్వామివారిని ప్రత్యక్షం చేసికొన్నందువల్ల ఇది రామకృష్ణ తీర్థమయ్యింది.

మకరమాస పుష్య నక్షత్రంతో కూడిన పున్నమినాడు శ్రీవారి ఆలయం నుండి అర్చకులు వెళ్లి అక్కడ శ్రీరామకృష్ణులకు అభిషేకార్చనలు చేసి వస్తారు.

ఈ తీర్థానికి యాత్రీకులు పాపవినాశనం వరకు బస్సులో వెళ్లి అచ్చటి నుండి నడచి వెళ్లాలి.

## కుమారధారా తీర్థం

తిరుమల శ్రీవారి ఆలయానికి ఉత్తరాన 6 మైళ్ల దూరంలో ఈ తీర్థం వుంది. పాపవినాశనం వరకు బస్సులో వెళ్లి అక్కడి నుంచి నడచి ఈ తీర్థాన్ని చేరుకోవాలి.

సర్వవిధాల రోగపీడితుడైన ఒక వృద్ధుడు ఈ తీర్థంలో స్నానం చేసి కుమారుడైనాడట. అందువల్లే ఇది కుమారధారా తీర్థం అని పిలువబడుతున్నది. అంతేగాక కుమారస్వామి తారకాసురసంహారం వల్ల తనకు కలిగిన బ్రహ్మహత్యా పాపాన్ని ఈ తీర్థంలో తపస్సుచేసి పోగొట్టుకొన్నాడట.

ప్రతి సంవత్సరం మాఘపూర్ణిమకు యాత్రికులు ఈ తీర్థంలో స్నానం చెయ్యడం అత్యంత ఫలప్రదం.

## తుంబురు తీర్థం (ఘోణ తీర్థం)

తిరుమల శ్రీవారి ఆలయానికి ఉత్తరం దిక్కునసుమారు పది మైళ్ల దూరంలో తుంబురు తీర్థం వుంది. దీన్నే ఘోణ తీర్థం, తుంబ తీర్థం అని కూడా అంటారు.

తుంబురుడనే మహర్షి, సర్వాబద్ధుడనే నాస్తికుడు స్నానంచేసి "సర్వసిద్ధుడు"గా మారి మోక్షం పొందారు.

ఫాల్గుణ పున్నమికి ఈ తీర్థముక్కోటి. వేలాది మంది భక్తులు వెళ్తారు. తిరుమల నుండి పాపవినాశనం వరకు బస్సులో వెళ్లి అక్కడి నుంచి 7 మైళ్లు నడిచి వెళ్లాలి.

ఈ తీర్థం సమీప గుహల్లో 300 ఏళ్ల క్రితం తరిగొండవెంగమాంబ అనే భక్తురాలు, ఆ తరువాతి కాలంలో శ్రీ మలయాళ స్వామివారు తపస్సు చేశారు.

ఇంతమాత్రమేకాక ఈ తిరుమల దివ్యక్షేత్రంలోని పర్వత సానువులలో జరాహర తీర్థం, ఫల్గుణితీర్థం, సనకసనందనతీర్థం, కాయరసాయనతీర్థం, దేవతీర్థం, అస్తిసరోవర తీర్థం, కటాహతీర్థం, శేషతీర్థం, శంఖుతీర్థం... మున్నగు అనేకానేక తీర్థాలు పుష్కరిణులు విలసిల్లుతున్నాయి. అందువల్లే శ్రీ వేంకటాచలక్షేత్రం "పుష్కరాద్రి" అని కూడా పిలవబడుతున్నది.

* * *

## 12. తిరుమలలో తెలుసుకోవలసిన - ప్రత్యేకస్థలాలు

### అఖండ శ్రీహరినామసంకీర్తన

తిరుమలలో **"శ్రీవారి కల్యాణకట్ట భవనం"** పక్కనే నిరంతరం శ్రీనివాసుని కీర్తిస్తూ, అఖండ భజన కార్యక్రమం జరుగుతుంటుంది. తి.తి.దేవస్థానం ధర్మప్రచారం పరిషత్" వారి ఆధ్వర్యంలో జరిగే శ్రీవారి అఖండభజనలో భక్తులు తిరుమలలో తమకు ఉన్న వెసులుబాటు సమయంలో కొద్దిసేపైనా భజనలో పాల్గొని గోవిందుణ్ణి కీర్తించవచ్చు. అమూల్యమైన ఆధ్యాత్మిక తేజస్సును పొంది తరించవచ్చు.

### ఆస్థానమండపం

తిరుమల శ్రీవారి ఆలయానికి ఎదురుగా శ్రీబేడి ఆంజనేయస్వామి ఆలయం ఉంది. ఆ గుడి వెనుక భాగంలో చాలా ఎత్తైన విశాలమైన

సభాభవనం ఉంది. అదే ఆస్థానమండపం. ప్రతిరోజు ఈ భవనంలో పురాణ ప్రవచనాలు, సంగీత కార్యక్రమాలు, హరికథాకాలక్షేపాలు జరుగుతుంటై. ఈ భవనంలో వాటిని వింటూ, ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని పొందండి.

## నాదనీరాజన మండపం

శ్రీవారిఆలయంముందర ఆగ్నేయమూలలో చాల విశాలమైన **"నాదనీరాజనమండపం"** ఉంది. ప్రతిరోజు సాయంత్రం 6 గం॥ నుండి 7.30 గంటల వరకు, ఈ మండపంలో శ్రీనివాసదేవునికి నీరాజనంగా ప్రపంచ ప్రఖ్యాత విద్వాంసులచే **"సంగీతవిభావరి"** కార్యక్రమాలు సమర్పించబడుతవి. శ్రీవారి గుడిముందు కూర్చొని భజనలు, హరికథలు, సంగీతనాట్యకార్యక్రమాలను చెవులారా వింటూ, కండ్లారా చూస్తూ ఆ మధురమైన క్షణాల్ని గడుపుతూ ఒక ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందవచ్చు.

## వైభవోత్సవ మండపం

శ్రీవారి ఆలయానికి ఈశాన్యమూలన, రాంబగీచ అతిథిగృహాల సమీపంలో **"శ్రీవారి వైభవమండప భవనం"** ఉంది. ప్రతిరోజు 2 గం॥ నుండి సాయంత్రం 4 గంటలవరకు ఈ వైభవోత్సవ భవనంలో శ్రీమలయప్పస్వామివారికి ఆర్జిత వాహనసేవలు, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఆర్జిత వసంతోత్సవం జరుగుతవి. భక్తులు తమకు ఉన్న వెసులుబాటు సమయంలో ఈ భవనంలోజరిగే నిత్యసేవలు దర్శించి ఆనందించవచ్చు.

## గ్రంథ విక్రయశాలలు

తిరుమల శ్రీవారిఆలయానికి ఎదురుగా, లేపాక్షి ఎదురుగా తి.తి.దేవస్థానంవారి **ఆధ్యాత్మిక గ్రంథ విక్రయశాలలు** ఉన్నాయి. భారత,

భాగవత, రామాయణాలు, శ్రీనివాసునిగూర్చి తెలిపే ఎన్నో పుస్తకాలు, "సప్తగిరి" మాసపత్రిక, క్యాసెట్లు... కాలెండర్లు, పంచాంగాలు విక్రయిస్తుంటారు. వాటిని తీసుకోవచ్చు. మీ వాళ్లకు బహుమతులుగా ఇవ్వవచ్చు. మాతృశ్రీ తరిగొండవెంగమాంబ నిత్యప్రసాద భవనంలో కూడా "ఆధ్యాత్మిక గ్రంథ విక్రయ కేంద్రం" ఉంది. అక్షయంగా ఆనందాన్ని అందించే ఆధ్యాత్మిక గ్రంథాల్ని తిరుమల యాత్రకు గుర్తుగా ఇంటికి తీసుకు వెళ్ళండి. "సప్తగిరి" మాసపత్రిక చందా కట్టండి.

## మాతృశ్రీ తరిగొండవేంగమాంబ నిత్యాన్న ప్రసాద భవనం

శ్రీవారి ఆలయానికి సరిగ్గా ఈశాన్యమూలన మూడంతస్థుల విశాలమైన ఎత్తైన **అన్న ప్రసాద వితరణ భవనం** భక్తులకు దర్శనమిస్తుంది. ఇదే **"మాతృశ్రీ తరిగొండవెంగమాంబ అన్న ప్రసాద భవనం"** ఈ భవనంలో భక్తులకు ఉదయం 7 గంటలకు నుండి 11 గంటలవరకు అల్పాహారం, ఉదయం 11గం. నుండి మధ్యాహ్నం 3గం. వరకు, మళ్ళీ రాత్రి 7గం. నుండి 11గం. భక్తులకు అన్న ప్రసాదవితరణ జరుగుతుంటుంది. భక్తులు ఈ భవనాన్ని దర్శించి ఇక్కడ వేలాదిమంది భక్తులకు జరుగుతున్న అన్న ప్రసాద వితరణమనే మహాయజ్ఞాన్ని దర్శించవచ్చు. తామూ అన్న ప్రసాదాన్ని స్వీకరించవచ్చు.

పూర్వం ఇదే చోట మాతృశ్రీ తరిగొండ వెంగమాంబగారి కుటీరం ఉండేది. అక్కడ ఆమె తిరుమలభక్తులకు నిత్యాన్నదానం చేసేవారనీ, అందువల్లే అదే చోట ఆమె పేరుతో ఈ అన్నప్రసాదం భవనం వెలసింది. ఈ భవనంలో నిత్యమూ జరుగుతున్న అన్న ప్రసాద వితరణకు తోడ్పడిన ఆ అన్నదాతలందరూ ఆనందనిలయుని అనుగ్రహంతో ఆనందంగా ఉండాలని ఆకాక్షించుదాం.

## పురోహిత సంఘం

తిరుమలలో రాంబగీచ అతిథిగృహాల వెనుకగా పాపవినాశనం వెళ్లే మార్గంలో ఉన్న టోల్‌గేటు నుండి నడచివెళ్ళగల అత్యంతదగ్గర్లోనే **"పురోహిత సంఘ భవనం"** ఉంది. తి.తి.దేవస్థానం ఆధ్వర్యంలో ఈ భవనంలో దేవస్థానంవారి పురోహితులు ఉంటారు. నిర్ణీతరుసుములు చెల్లించి వివాహాలు, ఉపనయనాలు, నిర్వహించుకోవచ్చు. చెవిపోగులు కుట్టుకోవచ్చు. ఈ కార్యక్రమాల అవసరాలు ఉన్నవారే గాక, ఇతరులకు చెప్పడానికైనా ఒక అవగాహన కోసం ఇక్కడికి వెళ్లి చూడవచ్చు.

## వేదపాఠశాల

నారాయణగిరి వెళ్ళే మార్గమధ్యంలో తి.తి.దేవస్థానం వారి వేదపాఠశాల ఉంది. ప్రాచీన గురుకుల ఆశ్రమ వాతావరణంలో ఏర్పాటు చేయబడిన ఈ వేదపాఠశాలలో చతుర్వేదాలు, ఆగమాలు, అర్చనావిధానాలు విద్యార్థులకు బోధింపబడుతున్నాయి. ఋష్యాశ్రమాలను తలపిస్తూ ఉన్న ఈ వేదపాఠశాలను చూచి తరించడం ఒక భాగ్యం!

## చివరగా ఒక్కమాట!

"తిరుమల"క్షేత్రానికి రావడం, ఎన్నో జన్మల పుణ్యఫలం! మరి సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామివారు తిరిగిన తిరుగుతున్న ఏడుకొండల్లో కొన్ని గంటలపాటు గడిపే అరుదైన అవకాశం రావడం ఆనందనిలయుడి అనుగ్రహం పొందినవారికి మాత్రమే లభ్యమవుతుంది. తిరుమల దివ్యక్షేత్రంలో ఆ యా ప్రదేశాలను సందర్శిస్తూ ఆ యా దివ్యతీర్థాల్లో పవిత్రస్నానాలు చేస్తూ ఆ యా అద్భుత ప్రదేశాలు విశేషాలను తెలుసుకొని ''తిరుమలక్షేత్రం'' పైన చక్కని అవగాహనతోపాటు ఆధ్యాత్మికానుభూతులను నిండుగా, మెండుగా అనుభవించి ఆనందించుదురుగాక!!

**గోవిందా! గోవిందా!! గోవింద!!!**